రాష్ట్ర ఎన్నికల అధికారి మీనాకు **నల్లమిల్లి ఫిర్యాదు** 8

మార్చి 1 నుంచి **ఇంటర్మీడియట్ పరీక్షలు** 7

షో ది బడ్జెట్



- సర్కారు బడాయి బడ్జెట్
- జిల్లాకు కేటాయింపుల్లేవ్
- అంతా అంకెల గారడీ
- పోలవరం మరిచారు..
- ప్రాజెక్టులను విస్మరించారు..
- పర్యాటకం పాతపాటే
- అభివృద్ధి గాలికొదిలేశారు
- కలెక్టరేట్ భవనాల ఊసేలేదు
- గోదావరిపై ప్రేమే లేదు..
- విస్తుపోయిన నాయకులు
- రాష్ట్ర బడ్జెట్‌పై విస్మయం

బడాయి ఫుల్.. విధిలింపులు నిల్..

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికలు దగ్గరపడ్డ నేపథ్యంలో నాలుగున్నరేళ్ల పాలన గురించిగొప్పగా డబ్బా కొట్టుకోవడం మినహా బుధవారం జగన్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌తో జనాలకు ఒరిగిందేం లేదు. ఏ పద్దు చూసినా స్వోత్కర్షే గానీ పైసల కేటాయింపులు లేవు. నవరత్నాలు, సాధారణ సంక్షేమ పథకాలకు చేసిన కేటాయింపుల బడాయే తప్పించి కొత్తగా ప్రవేశపెట్టిందేం లేదు. ఒకరకంగా చెప్పాలంటే జిల్లాకు ఈ బడ్జెట్‌తో ఒరిగింది శూన్యం. రాష్ట్ర బడ్జెట్‌లో గొప్పలు తప్ప గోరంత కూడా లాభం లేదు.. గతంలో ఏదో చేసేశామనే చెప్పారే తప్ప.. ఏం చేస్తామన్న దానిపై నోరు మెదపకపోవడం గమనార్హం. ఇది అసలు బడ్జెట్‌లా లేదని వైసీపీ రాజకీయ ప్రసంగంమాత్రమేననే విమర్శలు అన్ని రంగాల నుంచి వ్యక్తమవుతున్నాయి. ఎందుకంటే ఏ జిల్లాకు ఏం చేస్తాం.. కేటాయింపులేంటి.. ప్రాజెక్టుల మాటేంటి అనే అంశాలపై కనీస ప్రస్తావన లేకపోవడం గమనార్హం. పోలవరం ప్రాజెక్టుకు నిధుల ప్రస్తావన లేదు. గత ప్రభుత్వంలో హెడ్‌వర్క్ పనులు కేవలం 42 శాతం జరిగితే 70 శాతానికి తాము పనులు చేశామని చెప్పడం గమనార్హం. స్పిల్‌వేలో రేడియల్ గేట్లు ఏర్పాటు వైసీపీ గొప్పతనంగా చెబుతూ గోదావరి నదిపై చరిత్రలో మొదటగా రేడియల్ గేట్లు ఏర్పాటు చేసినట్టు ప్రకటించారు. వాస్తవానికి ఇది పాత డిజైనే. గత ప్రభుత్వం ఈ గేట్లనే ఏర్పాటు చేసింది. మిగతా వాటి గురించి వైసీపీ ప్రస్తావన తేలేదు. పట్టిసీట, పురుషోత్తపట్నం,చింతలపూడి ఎత్తిపోతల పథకాల ఊసేలేదు. వ్యవసాయానికి అంత చేశాం..ఇంత చేశాం అన్న గొప్పలేగానీ ఈ పనులకు ఏ విదిలింపులు లేవు. దీంతో కొత్త ప్రభుత్వం వచ్చాకే వీటికి మోక్షం అన్న సంకేతాలను జగన్ సర్కారు ఇచ్చినట్లయింది. ఇక పర్యాటక ప్రాంతంగా రాష్ట్రంలో చాలా సాధించామని చెప్పారు. జిల్లాలో ఇచ్చిన హామీల గురించి ప్రస్తావించలేదు. పర్యాటక రంగం అభివృద్ధిలో భాగంగా ఒబరాయ్ సంస్థతో ఒప్పందం చేసుకున్నట్టు ప్రకటించారు. ఈ ఒప్పందం రెండేళ్ల క్రితమే జరిగింది. పిచ్చుకలంకలో రిసార్ట్స్ కట్టడానికి అప్పట్లో నిర్ణయించారు. ఇంతవరకూ ఆ ఊసేలేదు. ఎన్నికలు కొద్ది రోజుల్లోనే జరగనున్నా వీటి ప్రస్తావన లేదు.. ఇక రోడ్లకు.. నీటి ప్రాజెక్టులకు కేటాయింపులు లేవు. ధవళేశ్వరం బ్యారేజిని పట్టించుకోలేదు. తెలుగువర్సిటీ గురించి మాట్లాడలేదు. బొమ్మూరులోని తెలుగు పీఠం ఊసెత్తలేదు. కొత్తగా జిల్లా ఏర్పాటు చేసినట్టు ప్రస్తావిం చారు. కానీ కలెక్టరేట్‌కు అవసరమైన కొత్త భవనాల నిర్మాణ ప్రస్తావన లేదు.మెడికల్ కాలేజీలు పూర్తయినట్టు , బోధనాసుపత్రులు పూర్తిస్థాయిలో పనిచేస్తున్నట్టు ప్రకటించారు. కానీ ఇక్కడ పరిస్థితి వేరేగా ఉంది. ఇటీవల పెద్దఎత్తున ఉద్యమం చేసిన అంగన్‌వాడీల జీతాలు పెంచినట్టు కూడా అందులో ప్రస్తావించారు.కానీ వాస్తవానికి జీతాలు పెంచలేదు.వేలాది మంది పేదలు ఇళ్ల కోసం ఎదురు చూస్తున్నారు. ఇప్పటికే లక్షలాది మందికి ఇచ్చినట్టు చెప్పారే కానీ అవి ఏస్థితిలో ఉన్నాయో.ఎప్పటికి పూర్తవుతాయో కూడా ప్రస్తావన లేదు.ఈ ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌ను పరిశీలిస్తే ఇప్పటికే ప్రజలు చాలా చేసేశాం, ఇంకేమీ చేయనక్కరలేదన్నట్టు ఉంది.కొత్త జిల్లాకు కేటాయింపుల్లేవ్.. బడాయి బడ్జెట్‌పై అన్ని వర్గాల నుంచి అసంతృప్తి వ్యక్తమవుతోంది. తెలుగుదేశం,జనసేన, వామపక్షాలు, బీజేపీ వంటి ప్రతిపక్షపార్టీలన్నీ బడ్జెట్ చూసి ముక్కున వేలేసు కునే పరిస్థితి ఏర్పడింది.

అంకెల గారడీ బడ్జెట్..



ఏపీ బడ్జెట్ అంకెల గారడీ మాత్రమే. దళిత సంక్షేమాన్ని పూర్తిగా గాలికొదిలేశారు. ఎస్సీ సబ్‌ప్లాన్ నిధులు కేటాయింపులు, వినియోగంపై ఎక్కడ స్పష్టత లేదు. విద్యా వ్యవస్థకు కేటాయింపులపై గందరగోళమే. ఎన్నికల బడ్జట్ కొండంత రాగం తీసి ఏదో పాట పాడినట్లుగా ఉందన్నారు. - **జవహర్, టీడీపీ జిల్లా అధ్యక్షుడు**

వైసీపీకి విజన్ లేదు



వైసీపీకి విజనే లేదు.. ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెట్ కూడా సరిగ్గా పెట్టలేకపోయారు. ఇక పూర్తి స్థాయి బడ్జెట్ ఎలా పెట్టగలరు. మీకంటూ విజన్ ఉంటే.. బడ్జెట్‌లో కనిపించేది. ఓడిపోతారని తెలిసే ఇలా పేలవంగా బడ్జెట్ పెట్టారు. మేం అధికారంలోకి రాగానే అద్భుతమైన బడ్జెట్ ప్రవేశపెడతాం. - **దుర్గేష్, జనసేన జిల్లా అధ్యక్షుడు**

అంతా దగా పాలనే..



రాష్ట్ర బడ్జెట్ పేరుగొప్ప, ఊరు దిబ్బ అన్న చందంగా ఉంది. యువతను మోసం చేసే విధంగా రాష్ట్ర బడ్జెట్ ఉంది. ఉద్యోగులకు జీతాలు కూడా చెల్లించలేని స్థితిలో అప్పులతో రాష్ట్రం ఉంటే సంపన్న రాష్ట్రం అంటూ ఆర్థికమంత్రి చెప్పుకోవడాన్ని నిరసిస్తున్నాం సుపరిపాలన ఎక్కడ ఉంది, అంతా దగా పాలనే. - **మధు, సీపీఐ జిల్లా కార్యదర్శి**

ఇది పారదర్శకత లేని బడ్జెట్



ఇది పారదర్శకత లేని బడ్జెట్. అంకెల గారడీతో ప్రవేశపెట్టిన బడ్జెట్. అభివృద్ధి, సంక్షేమాన్ని బడ్జెట్‌లో విస్మరించారు. ఇది ఓటాన్ ఎకౌంట్ బడ్జెట్ మాత్రమే. రాబోయే టీడీపీ, జనసేన ఉమ్మడి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత పూర్తిస్థాయి ప్రజారంజక బడ్జెట్‌ను ప్రవేశపెడతాం.
- **బూరుగుపల్లి శేషారావు, మాజీ ఎమ్మెల్యే, నిడదవోలు**

రోడ్లన్నీ బ్రహ్మండమట?



రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ ప్రజలను ఉద్యోగులను మోసగించడమే ధ్యేయంగా ఉంది. ఎన్నికల హామీలన్నీ ఈ బడ్జెట్‌లో ప్రవేశపెట్టడం మోసపూరితమే. బడ్జెట్ ప్రసంగంలో రాష్ట్రంలో రోడ్లన్నీ బ్రహ్మండంగా అభివృద్ధి చెందాయనడం హాస్యాస్పదంగా ఉంది.
- **నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, మాజీ ఎమ్మెల్యే, అనపర్తి**

మోసపూరిత బడ్జెట్



రాష్ట్ర బడ్జెట్ గందరగోళంగా ఉంది. చెప్పేదొకటి చేసేదొకటి అనే విధంగా ప్రభుత్వం బడ్జెట్‌తో మభ్య పెట్టింది. అంకెలలో చెబితేనే అర్థం కాని సామాన్యులకు శాతాల్లో చెప్పి ముఖ్యమంత్రి ప్రజలను బురిడికొట్టే ప్రయత్నం చేశారు. మోసపూరిత బడ్జెట్ ఇది.
- **ఎం. వెంకటరాజు, గోపాలపురం ఇన్‌చార్జి**

ప్రజలను మభ్యపెట్టే బడ్జెట్



గందరగోళ బడ్జెట్‌తో వైసీపీ ప్రభుత్వం ప్రజలను మరోసారి మభ్య పెట్టింది. పూర్తిస్థాయిలో ఏ రంగానికి కేటాయింపులు లేవు. ఎందుకు బడ్జెట్ ప్రవేశపెట్టారో కూడా అర్థం కాలేదు. పనికిరాని బడ్జెట్ ఇది. ఎన్నికలను పురస్కరించుకుని అంగెల గారడీ చూపారు.
- **జొన్నలగడ్డ సుబ్బరాయచౌదరి, కొవ్వూరు**

గొప్పలు తప్ప.. ఏమీ లేదు..



వైసీపీ ప్రభుత్వం ఎన్నికల ముందు ప్రవేశపెట్టిన ఓట్‌ఆన్ అకౌంట్ బడ్జెట్ చూస్తే బాధ కలుగుతుంది. గొప్పలు చెప్పుకోవడం తప్ప అందులో ఏమీ లేదు. ఈ బడ్జెట్టే వైసీపీ ప్రజా వ్యతిరేక విధానాలకు నిదర్శనం. ఎందుకు ప్రవేశపెట్టారో కూడా అర్థం కాలేదు.
- **అనుశ్రీ సత్యనారాయణ, రాజమహేంద్రవరం**

ప్రయోజనం ఏమీ లేదు..



రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో కేటాయింపులు సక్రమంగా లేవు. పరిశ్రమలు, కేటాయింపులకు రాయితీలు, ప్రాజెక్టులు,వ్యవసాయ రంగాలకు పెద్దగా ఒరిగిందేమిలేదు. ఈ బడ్జెట్ ఆశాజనకంగా లేదు. స్వయం ఉపాధి రంగాలను నిర్వీర్యం చేశారు.
- **కే అనంత్ , రాజమహేంద్రవరం**



నిడదవోలులో ఆశ కార్యకర్త హేమలత హౌస్ అరెస్ట్



కొవ్వూరులో సుందరబాబుకు నోటీస్ అందజేత

వైసీపీలో..ఆశా..నిరాశేనా!

ఆశాల చలో విజయవాడ అడ్డగింత - ముందస్తు నోటీసులు..హౌస్ అరెస్టులు

కొవ్వూరు/నిడదవోలు/రాజమహేంద్రవరం అర్బన్, ఫిబ్రవరి 7 : ప్రభుత్వం ఆశా వర్కర్లను వదల్లేదు.. తమ డిమాండ్ల సాధనకు ఛలో విజయవాడకు బయలు దేరితే.. పోలీసుల సాయంతో ఆదిలోనే అడ్డుకున్నారు. అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల సందర్భంగా ఆశా వర్కర్ల కనీస వేతనాలు అందించాలని కోరుతూ ఈ నెల 8వ తేదీన చలో విజయవాడకు యూనియన్ సంఘాలు పిలుపు నిచ్చాయి. ఈ మేరకు ఒక రోజు ముందుగానే ఆశ కార్యకర్తలకు నోటీసులు అందించి పోలీసులు నిర్బంధించారు. నిడదవోలు పట్టణంలోని ఇందిరానగర్‌లో ఉంటున్న ఆశా వర్కర్స్ యూనియన్ నాయకురాలు హేమలతను బుధవారం హౌస్ అరెస్ట్ చేశారు. ఆమెను హౌస్ అరెస్ట్ చేయడానికి ఒక హెడ్ కానిస్టేబుల్, ఇద్దరు సచివాలయ మహిళా సంరక్షణ కార్యదర్శులు, ఒక మహిళా హోమ్ గార్డులను వినియోగించారు. దాదాపు జిల్లా వ్యాప్తంగా ఆశ కార్యకర్తలకు నోటీసులు అందజేసి నిర్బంధం విధించారు. కదిలితే ఖబడ్దార్ అంటూ హెచ్చ రికలు జారీ చేశారు. దీనిపై పలు సంఘాల నాయకులు ఆందోళన వ్యక్తం చేశారు. ఆశావర్కర్లకు మద్దతిస్తున్న సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఎం.సుందరబాబుకు పోలీసులు నోటీసులు జారీచేసి హౌస్ అరెస్టు చేశారు. ఆశా కార్యకర్తలకు రాష్ట్ర ప్రభుత్వం కనీస వేతనాలు అందించక పోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వశాఖల్లో పనిచేస్తున్నవారికి రాజ్యాంగబద్ధంగా చెల్లించవలసిన వేతనాలు, సౌకర్యాలు కల్పించడంలో వైసీపీ ప్రభుత్వం, జగన్మోహనరెడ్డి పూర్తిగా వైఫల్యం చెందారన్నారు. ఆశాలు విజయవాడ వెళ్లకుండా రాష్ట్ర ప్రభుత్వం పోలీసులతో ముందస్తు అరెస్టులు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని సీఐటీయూ జిల్లా కమిటీ పేర్కొంది. బుధవారం పోలీసులు యూనియన్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు దుర్గ, హవేలాను ముందస్తు అరెస్టు చేయడంతో వారిని సిఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బి. రాజులోవ, సీపీఎం నగర కార్యదర్శి పవన్ పరామర్శించారు. జగన్ ప్రభుత్వం ఐదేళ్ల కాలంలో ఆశ వర్కర్ల సమస్యలు పరిష్కరించడంలో విఫలమైందని అన్నారు. ప్రజాస్వామ్యబద్ధంగా జరిగే నిరసనలు అణచివేయాలని చూడడం సరైనవిధానం కాదన్నారు. అరెస్టు చేసిన వారిని వెంటనే విడుదల చేయాలని, ఆశ వర్కర్ల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

మృతుల ఓట్లపై దృష్టి పెట్టండి

ఎన్నికలపై జరిగిన సమావేశంలో కలెక్టర్ మాధవీలత

రాజమహేంద్రవరం, ఫిబ్రవరి7(ఆంధ్రజ్యోతి) : జిల్లాలో తుది ఓటర్ల జాబితాలో అనేక చోట్ల మరణించిన వారు పేర్లు కూడా ఉన్నాయని 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనాలపై జిల్లాకలెక్టర్ డా.కె.మాధవీలత స్పందించారు. కలెక్టరేట్‌లో బుధవారం రాజకీయ పార్టీల ప్రతినిధులు, ఎన్నికల అధికారులతో జరిగిన సమావేశంలో పలు అంశాలను ప్రస్తావించారు. 'మరణించిన ఓటర్లు, జిల్లాలో ఇప్పటి వరకూ తొలగించిన 0.1శాతం ఓటర్లకు సంబంధించి నియోజకవర్గస్థాయిలో ఈఆర్‌ఓలు నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. 2003 ఏప్రిల్ నుంచి ఈ నెల 6వ తేదీ వరకూ జిల్లాలో మరణించిన 37,888 మంది ఓటర్ల పేర్లను జాబితా నుంచి తొలగించామన్నారు. 6,7,8 ఫారమ్‌ల ద్వారా 56,231 అభ్యంతరాలురాగా 28 వేలు పరిష్కరించగా మిగిలినవి పరిశీలనలో ఉన్నాయన్నారు. నియోజకవర్గాల వారీగా తొలగించిన ఓటర్ల జాబితాపై రిటర్నింగ్ అధికారులు సమగ్ర సమాచారం ఇవ్వాలన్నారు.గత నెల 22న ప్రకటించిన ఓటర్ల తుది జాబితాలో దొర్లిన తప్పులను గుర్తించి సరిచేయాలన్నారుఉ. రాజకీయపార్టీలు కూడా ఓటింగ్ శాతం పెరిగేలా చూడాలని సూచించారు. సమావేశంలో కాంగ్రెస్ పార్టీ ఆఫీస్ ఇన్‌చార్జి, ఎన్.రమేష్, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.రామచంద్రరావు, ఆప్ జిల్లా కార్యదర్శి ఎన్.సుబ్రహ్మణ్యం, సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు ఎస్.ఎస్.మూర్తి, వైసీపీ పోల్ నిర్వహణ ఇన్‌చార్జి, రాజశేఖర్,టీడీపీ జోన్-కార్యదర్శి శ్రీనివాసరావు పాల్గొన్నారు.



డిస్ట్రిబ్యూషన్ కేంద్రంలో కలెక్టర్, కమిషనర్ పరిశీలన

డిస్ట్రిబ్యూషన్ కేంద్రం పరిశీలన

రాజమహేంద్రవరం సిటీ, ఫిబ్రవరి 7: రాజమహేంద్రవరం అర్బన్ నియోజకవర్గానికి సంబంధించిన ఎలక్షన్ మెటీరియల్ డిస్ట్రిబ్యూషన్ కేంద్రాన్ని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ మాధవీలత, రాజమండ్రి ఎన్నికల అధికారి ,కమిషనర్ దినేష్ కుమార్ పరిశీలించారు. రాజమహేంద్రవరం ఎస్‌కేవీటీ డిగ్రీ కళాశాలలో ఉన్న డిస్ట్రిబ్యూషన్ కేంద్రం వద్దకు వచ్చి తాత్కాలికంగా ఏర్పాటు చేసే స్ట్రాంగ్ రూమ్ గురించి చర్చించారు. ఆర్‌వోల వెంట డీటీ పవన్‌కుమార్, కళాశాల అధికారులు, ఇతర అధికారులు ఉన్నారు.

మెడికల్ కాలేజీ పనులు!



ఎంత కాలమిలా : రాజమహేంద్రవరంలో సాగుతున్న మెడికల్ కాలేజీ భవన నిర్మాణ పనులు

నత్తనడకన నిర్మాణ పనులు

- సా..గుతున్న భవన నిర్మాణ పనులు
- టెంపరరీ భవనంలోనే తొలి ఏడాది కాలేజీ నిర్వహణ
- ఇంకా పూర్తికాని హాస్టళ్లు.. విద్యార్థులకు ఇబ్బందులు
- ఆరంభంకాని కొత్త బోధనాసుపత్రి పనులు
- రూ.475 కోట్లు కేటాయింపు.. రూ.90 కోట్ల పనులు
- రెండేళ్లయినా పూర్తికాని మెడికల్ కాలేజీ భవనాలు

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

రాజమహేంద్రవరం ప్రభుత్వ మెడికల్ కాలేజీ పనులు నత్తనడకన సాగుతున్నాయి. ఎక్కడా లేని విధంగా ఇక్కడ 34 ఎకరాల భూమి సునాయాసంగా బదిలీ అయింది. టీడీపీ హయాంలో కొత్తగా నిర్మించిన కోస్తా జిల్లాల జైళ్ల డీఐజీ ఆఫీసు భవనంతో పాటు, ఆయన క్వార్టర్, జిల్లా ఆసుపత్రి భవనాలన్నీ కలిసి వచ్చాయి. అయినా ఇంకా మెడికల్ కాలేజీ పనులు ఒక కొలిక్కి రాలేదు.రాజమహేంద్రవరంలో 2021లో రూ.475 కోట్లతో మెడికల్ కాలేజీని ప్రభుత్వం మంజూరు చేసింది.రాజమహేంద్రవరం జిల్లా ఆసుపత్రికి సంబంధించిన 20 ఎకరాల భూమి,ఆసుపత్రి భవనాలను స్వాధీనం చేసుకుంది. సమీపంలోని సెంట్రల్ జైలుకు చెందిన 10.5 ఎకరాలు,మరో మూడున్నర ఎకరాలు మెడికల్ కాలేజి కోసం ప్రభుత్వం బదిలీ చేసింది. దీంతో భూసేకరణకు పైసా ఖర్చులేకుండా పోయింది.గతేడాది నుంచే మొదటి బ్యాచ్ పిల్లలు చేరారు. మూడున్నర ఎకరాల స్థలంలో కాలేజీ తాత్కాలిక భవనం నిర్మించి, అక్కడ తరగతులు ప్రారంభించారు. ఇక్కడ ద్వితీయ సంవత్సరం విద్యార్థు లకు ఉపయోగపడుతుందని చెబుతున్నారు. రెండేళ్ల తర్వాత దీనిని నర్సింగ్ కాలేజీకి ఇవ్వవలసి ఉంది. ఇంకా నర్సింగ్ కాలేజీ శాంక్షన్ కాలేదు. ప్రధాన మెడికల్ కాలేజీ పనులు నత్తనడకన సాగుతున్నాయి. చాలా భవనాలు ఇంకా పునాదుల్లోనే ఉన్నాయి. ఇది పూర్తి కావడానికి కనీసం రెండేళ్లు పడుతుందని అక్కడి ఇం జనీర్లు, కాంట్రాక్టర్లు చెబుతున్నారు. బోధనాసుపత్రి పనులు ఇంకా ఆరంభమే కాలేదు. ప్రస్తుతం జిల్లా ఆసుపత్రిలోని పాత భవనాలను ఆధునికీకరిస్తూ బెడ్స్ పెంచుతున్నారు. ఒక పక్క ఆసుపత్రి నిర్వహణ జరుగు తుండగానే పనులు జరుగుతున్నాయి.మాతాశిశు భవ నంలో కొద్ది నెలల కిందట ఓ శ్లాబ్ కూడా కూలిపోయింది. మొత్తం మీద బోధనాసుపత్రి అని పేరు మార్చి, కాలేజీకి అనుబంధంగా బదిలీ చేశారు. కానీ ఇంకా పూర్తి స్థాయి బోధనాసుపత్రిగా ఇక్కడ వైద్య సేవలు అందడంలేదు. రోగులు కూర్చోవడానికి చోటు లేక చెట్ల కింద కూర్చుంటున్నారు. పాత ఆసుపత్రిలో 250 బెడ్స్ ఉండగా ఏడాదికి 100 పడకలు చొప్పున పెంచుతు న్నట్టు అక్కడ నిర్వాహకులు చెబుతున్నారు. ప్రస్తుత పనితీరు,డబ్బులు లేక లేజీ తనమూ చూస్తుంటే ఎన్నేళ్లకు ఇది పూర్తవుతుందోననే ఆందోళన ఉంది.



పునాది దాటని పనులు

హాస్టల్ సౌకర్యమేదీ?

ప్రస్తుతం 150 మంది మెడికల్ విద్యార్థులతో ఈ కాలేజీలో మొదటి ఏడాది క్లాస్‌లు ఆరంభమయ్యాయి.విద్యార్థులు హాస్టళ్ల సౌకర్యం కోసం చాలా ఇబ్బంది పడ్డారు.కానీ జైళ్ల శాఖ డీఐజీ నుంచి స్వాధీనం చేసుకున్న క్వార్టర్‌లో బాయ్స్ హాస్టల్ పెట్టారు.ఇది కొంత మందికే సరిపోతుంది. దీని పక్కనే ప్రధాన కాలేజీ పనులు ఆరంభించారు.లేడీస్ హాస్టల్ పాత ఆసుపత్రిలో ఓ భవనంలో పెట్టారు. మరో రెండు చోట్ల కూడా బాయ్స్, లేడీస్‌కు తాత్కాలిక హాస్టళ్ల ఏర్పాటు చేశారు.ఇక్కడ సరైన సౌకర్యాలు లేక విద్యార్థులు ఇబ్బందులకు గురవుతున్నారు. కొత్త భవనాలు రెండు నిర్మాణంలో ఉన్నాయి. ఇవన్నీ నాణ్యతలేని సిమెంట్ ఇటుకలతో కట్టేస్తుండడం గమనార్హం.ఇవి పూర్తి కావడానికి చాలా సమయం పడుతుంది.ఈ ఏడాది ఆగస్టు, సెప్టెంబరులో మెడికల్ విద్యా ర్థుల కౌన్సెలింగ్ ఉంటుంది.కొత్తగా చేరేవారికి హాస్టల్ సౌకర్యం ఇబ్బందికరమే.

సూపర్ స్పెషాలిటీ సౌకర్యాలేవీ?

ముఖ్యమంత్రి జగన్ ప్రతి మెడికల్ కాలేజీలోనూ సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలు అందుతున్నాయని చెబితే ఇక్కడ వైద్య సేవల కోసం వచ్చిన వారు ఆవేదన చెందుతున్నారు. కాలేజీలో జూనియర్ ఫ్యాకల్టీ ఉంది. అనుభవజ్ఞులు లేరు.పలు విభాగాలకు వైద్యులే లేరు. ఎంఆర్‌ఐ, సిటీ స్కానింగ్ వంటి సౌకర్యాలు పాత ఆసు పత్రి నుంచి ఉన్నాయి. ఇతర అత్యాధునిక సౌకర్యాలేమీ లేవు. చాలా డిపార్ట్‌మెంట్లకు హెడ్స్ లేరు. వారుంటే ఇక్కడ అసిస్టెంట్ ప్రొఫెసర్లు లేరు. రేడియాలజిస్టులు ఎవరకూ జాయిన్ కావడం లేదు. వచ్చిన వారు వచ్చినట్టే వెళ్లిపోతున్నారు.సూపర్ స్పెషాలిటీకి చెందిన పోస్టులు మంజూరయ్యాయి.కానీ కౌన్సెలింగ్ పూర్తికాలేదు. ఇంకా అనేక ముఖ్య పోస్టులు ఖాళీగా ఉన్నాయి. రూ.475 కోట్లతో ఈ మెడికల్ కాలేజీ నిర్మాణం చేపట్టినా ఇప్పటికి సుమారు 90 కోట్ల మేర పనులు మాత్రమే జరిగినట్టు ఇంజనీరింగ్ విభాగం అధికారుల కథనం. ఈ పరిస్థితు ల్లో పూర్తి స్థాయిలో ఈ కాలేజిలో 600 బెడ్స్ ఎప్పుడు ఏర్పడతాయో, కాలేజి , కొత్త ఆసుపత్రి, హాస్టళ్ళ ఎప్ప టికి పూర్తవుతాయో మరి. పైగా ఈ కాలేజీల వల్ల స్థానిక విద్యా ర్థులకు ఎక్కువ అవకాశం అనేది సరి కాదు. కౌన్సెలింగ్ విధానం వల్ల ఇతర ప్రాంతాల వారే ఎక్కువ ఉన్నారు. ఇక్కడ నర్సుల కొరత ఎక్కువ ఉంది. ఇలా మెడికల్ కాలేజీలో పనులు లేజీయే..సిబ్బంది లేక చదువు లేజీయే మరి..

ఇంటర్ పరీక్షలు

ప్రశాంతంగా నిర్వహించాలి

అధికారులతో సమావేశమైన డీఆర్‌వో నరసింహులు

రాజమహేంద్రవరం, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ పరీక్షలు ప్రశాంత వాతావరణంలో పగడ్బందీగా నిర్వహించడానికి పూర్తి సమన్వయంతో అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని డీఆర్‌వో నరసింహులు ఆదేశించారు. ఈ మేరకు కలెక్టరేట్‌లో వివిధ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటర్ పరీక్షలు మూడు దశల్లో జరుగుతాయన్నారు. మార్చి 1 నుంచి 20 వరకూ ఉదయం 9గంటల నుంచి 12గంటల వరకూ పరీక్షలు ఉంటాయన్నారు. జిల్లాలో మొత్తం 52 పరీక్షా కేంద్రాల్లో 19,336 మంది మొదటి ఏడాది, 18,166 మంది రెండో ఏడాది పరీక్షలకు హాజరవుతారన్నారు. ఒకేషనల్ కోర్సులకు సంబంధించి 3,802 మంది పరీక్షలు రాస్తారన్నారు. ప్రతి పరీక్షా కేంద్రంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి నిరంతర పర్యవేక్షణ చేస్తామన్నారు. విద్యార్థులు హాల్ టికెట్‌తో పాటు ప్రభుత్వం ద్వారా జారీ అయిన ఏదో ఒక గుర్తింపు కార్డు తప్పనిసరిగా తీసుకెళ్లాలన్నారు. విద్యుత్ నిరంతరాయంగా ఉండాలని, జనరేటర్లను కూడా సిద్ధం చేసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. దివ్యాంగుల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేయాలన్నారు. విద్యుత్, తాగునీరు, మరుగుదొడ్లు, మెడిసిన్స్, అత్యవసర సదుపాయాలను అందుబాటులో ఉంచాలన్నారు. ఆయా పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేయడంతో పాటు కంప్యూటర్, జిరాక్స్ సెంటర్లను మూసివేయించాలన్నారు. పూర్తిస్థాయిలో బందోబస్తు ఏర్పాట్లు చేయాలన్నారు. విద్యార్థులకు ఇబ్బంది కలుగకుండా ఆయా మార్గాల్లో ఆర్టీసీ బస్సుల వేళలను మార్పు చేసుకోవాలని సూచించారు. ఎలక్ట్రానిక్ గాడ్జెట్లు, మొబైల్ ఫోన్లు, కాలిక్యులేటర్లు, ఐప్యాడ్, బ్లూటూత్, పేజర్ లేదా ఇంటరాక్ట్ ప్రోగ్రామింగ్ చేసే ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలకు పరీక్షా కేంద్రాల్లోకి అనుమతి ఉండదని, అందువల్ల వాటిని విద్యార్థులు తీసుకురావద్దని ఆయన సూచించారు. కార్యక్రమంలో ఆర్‌ఐవో ఎన్ఎస్‌వీఎల్ నరసింహం, జిల్లా పంచాయతీ అధికారి డి.రాంబాబు, ఆర్టీసీ ఏఎం ఎం.అజయ్‌బాబు తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న నరసింహులు

కొవ్వూరులో శోభాయాత్ర

ప్రత్యేక పూజల నిర్వహణ

కొవ్వూరు, ఫిబ్రవరి 7 : త్రిదండి స్వామీజీ శ్రీశ్రీ మద్భక్తి సుధీర దామోదర మహరాజు ద్వితీయ వార్షిక విరహ మహోత్సవాలను పురస్కరించుకుని కొవ్వూరు గౌడీయామఠం స్వామీజీ శ్రీమద్భక్తి విబుధ వామన మహరాజు ఆధ్వర్యంలో బుధవారం శోభాయాత్ర నిర్వహించారు. కొవ్వూరు లాంచీల రేవు వద్ద ఉన్న శ్రీ రామానంద గౌడీయామఠంలో రాధాకృష్ణులకు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం పట్టణ వీధులలో శ్రీమద్భక్తి విబుధ వామన మహరాజు ఆధ్వర్యంలో 108 కలశాలతో నగర సంకీర్తన, శోభాయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీమద్భక్తి విబుధ వామన మహరాజు మాట్లాడుతూ ఈనెల 7నుంచి 13వ తేదీ వరకు గౌడీయామఠంలో భాగవత సప్తాహములు, త్రిదండి స్వామీజీ శ్రీశ్రీ మద్భక్తి సుధీర దామోదర మహరాజు తిరోభావము, శ్రీశ్రీకృష్ణవసంత పంచమి, శ్రీవిష్ణుప్రియ ఆవిర్భావం, శ్రీల పుండరీక విద్యానిధి, శ్రీల రఘునందన ఠాకూరుల ఆవిర్భావములను పురస్కరించుకుని ప్రత్యేక హోమాలు, అభిషేకాలు, పూజలు, నైవేద్యాలు, ప్రసాద వితరణ జరుగుతాయన్నారు. ఈ సమావేశంలో శ్రీపాద భక్తిప్రమోద జనార్ధన మహరాజు, శ్రీపాద రమణ కృష్ణదాస్ పాల్గొన్నారు.


శోభాయాత్ర నిర్వహిస్తున్న దృశ్యం


ఆధ్యాత్మిక ప్రసంగం చేస్తున్న స్వామీజీ

144 అడుగుల ఆంజనేయ

విగ్రహ స్థాపనకు భూమిపూజ


భూమిపూజ నిర్వహిస్తున్న శ్రీగణపతి సచ్చిదానంద స్వామీజీ

రాజానగరం, ఫిబ్రవరి 7: జాతీయ రహదారిని ఆనుకుని వెలుగుబంద పరిధిలోని దత్త ఆశ్రమం ప్రాంగణంలో రూ.10 కోట్లతో నెలకొల్పనున్న 144 అడుగుల బృహదాకార కార్యసిద్ధి శ్రీఅంజనేయస్వామి వారి విగ్రహ స్థాపనకు మైసూరు దత్తపీఠాధీశులు శ్రీగణపతి సచ్చిదానంద స్వామీజీ బుధవారం భూమిపూజ చేశారు. మహవీర్ హనుమాన్ ట్రస్ట్ ఆధ్వర్యంలో విగ్రహ నిర్మాణం చేపడుతున్నట్లు నిర్వాహకులు తెలిపారు. దీనిలో భాగంగా తొలుత వాస్తు పూజ, విశ్వ దేవత హోమం, భూమిపూజ క్రతువులు వేదమంత్రోచ్ఛరణ మధ్య వైభవంగా నిర్వహించారు. జైశ్రీరామ్, జైశ్రీరామ్ నినాదాలతో ఆశ్రమ ప్రాంగణం మార్మోగింది. గణపతి హోమం, వాస్తు హోమం, మన్యుసూక్త సహిత రామతారక హోమం చేపట్టారు. అనంతరం బృహదాకార హనుమ విగ్రహ శంకుస్థాపన మహోత్సవ క్రతువును కన్నుల పండువగా నిర్వహించారు. పాతాళంలో సూక్ష్మ ఆంజనేయ, మధ్యలో చిన్న ఆంజనేయస్వామి విగ్రహాలు కూడా విరాట్ ఆంజనేయ స్వామి విగ్రహం చెంతన రూపుదిద్దుకోనున్నాయి. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జక్కంపూడి రాజా మాట్లాడుతూ ఈ నెల 18న కోరుకొండ లక్ష్మీ నరసింహస్వామి క్షేత్ర అభివృద్ధిలో భాగంగా రంగనాథస్వామి ఆలయ పునర్నిర్మాణ కార్యక్రమాన్ని చిన జీయర్ స్వామివారి చేతుల మీదుగా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. సాహితీవేత్త ఎర్రా ప్రగడ రామకృష్ణ వ్యాఖ్యాతగా వ్యవహరించిన ఈ కార్యక్రమంలో ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ షర్మిలారెడ్డి, ఇన్నమూరి దీప, తోట సుబ్బారావు, గూడూరి రాధిక, అశ్విన్ జవార్, పంతం కొండలరావు, కేఎల్ఎస్ రెడ్డి, మేడి త్రిమూర్తులు, లంక సత్యనారాయణ, వీరబాబు, రామరాజు, వైసీపీ మండల కన్వీనర్ దూలం పెద్ద, నాయకులు గంగిశెట్టి సోమేశ్వరరావు, మండారపు వీర్రాజు, ఇలపకుర్తి కామేశ్వరరావు, సోడసాని తాతబ్బాయి, సీతానగరం ఎంపీపీ గుర్రాల జ్యోత్స్న తదితరులు పాల్గొన్నారు.

50 ఏళ్ల తర్వాత

పూర్వ విద్యార్థుల సమ్మేళనం


సమావేశమైన పూర్వ విద్యార్థులు

అమలాపురం టౌన్, ఫిబ్రవరి 7: ఐదు దశాబ్దాల క్రితం అమలాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి వరకు చదువుకున్న విద్యార్థులంతా బుధవారం స్వర్ణోత్సవ సంబరాలు జరుపుకున్నారు. 1974లో పదో తరగతి పూర్తి చేసిన విద్యార్థులు రాష్ట్ర, రాష్ట్రేతర ప్రాంతాలతో పాటు విదేశాల్లో స్థిరపడ్డారు. వీరంతా తాము చదువుకున్న పాఠశాల ప్రాంగణంలో ఆటపాటలతో రోజంతా ఆనందోత్సాహాలతో గడిపారు. చిన్ననాటి మధుర స్మృతులను నెమరు వేసుకున్నారు. డాక్టర్ డి.రామచంద్రరావు స్వగృహం వద్ద నిర్మించిన సాంస్కృతిక కళా వేదికపై ప్రదర్శనలు నిర్వహించి సందడి చేశారు. కామాక్షి ప్రేమ మందిరం, స్థానిక అంధుల పాఠశాలలో విద్యార్థులకు తమ వంతు సాయం అందించారు. అదే బ్యాచ్‌కు చెందిన చిన్నపిల్లల వైద్య నిపుణుడు డాక్టర్ కొత్తూరి శ్రీమన్నారాయణ వృద్ధాప్యం లో పాటించాల్సిన ఆరోగ్య సూత్రాలను వివరించారు. సాయంత్రం భారమైన హృదయాలతో వీడ్కోలు చెప్పుకున్నారు. కార్యక్రమాన్ని నడిపించిన పూర్వ విద్యార్థులు శిష్ఠా రామగోపాలం, డాక్టర్ దుంగా వెంకట్, మహ్మద్ ఆజామ్, కర్రా రామకృష్ణ, పెమ్మరాజు విజయ్, పి.రమణ, మంగిపూడి ప్రసాద్, భువనేశ్వరిను ప్రత్యేకంగా అభినందించారు. ప్రతి ఏటా పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించడంతో పాటు సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించేందుకు తీర్మానించారు.

రేషన్ బియ్యం పట్టివేత

బిక్కవోలు, ఫిబ్రవరి 7: బిక్కవోలు గ్రామంలో బుధవారం రాత్రి విజిలెన్స్ అధికారులు ఆటోలో తరలిస్తున్న 600 కిలోల పీడీఎస్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. విజిలెన్స్ ఎస్పీ కెఎస్ఎస్‌వీ సుబ్బారెడ్డి మాట్లాడుతూ ఈ బియ్యాన్ని గ్రామంలోని చలపతి ప్రసాద్, ఇంటి రాంబాబు కిలో రూ.20లకు కొనుగోలు చేసి తమ చేపల చెరువుల్లో దాణాకు వినియోగిస్తున్నారన్నారు. ఈ బియ్యం విలువ రూ. 2.27 లక్షలు ఉంటుందన్నారు. సివిల్ సప్లయ్స్ అధికారులు ఆటోను సీజ్ చేసి 6ఏ కేసు నమోదు చేసి సదరు వాహనం యజమాని, సంబంధిత వ్యక్తులపై క్రిమినల్ కేసులు నమోదు చేయుటకు బిక్కవోలు పోలీస్ స్టేషన్‌కు సిఫార్సు చేశారన్నారు. కార్యక్రమంలో డీటీ కృష్ణ, హెడ్ కానిస్టేబుల్ శివకుమార్, రెవెన్యూ, సివిల్ సప్లయ్స్ అధికారులు పాల్గొన్నారు.

12న అప్రెంటీస్ మేళా

కార్పొరేషన్(కాకినాడ), ఫిబ్రవరి 7: కాకినాడ, కోనసీమ, తూర్పుగోదావరి జిల్లాల్లో వివిధ కంపెనీల్లో అప్రెంటిస్ ఖాళీలను భర్తీ చేయడానికి కాకినాడ ప్రభుత్వ ఐటీఐలో ఈనెల 12న ఉదయం ఐటీఐ పాస్ అయిన విద్యార్థులకు ప్రైమ్ మినిస్టర్ నేషనల్ అప్రెంటీస్ మేళా 2024 నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ వర్మ తెలిపారు. గవర్నమెంట్ ఐటీఐ, ప్రైవేటు ఐటీఐలలో వివిధ ట్రేడ్స్‌లలో ట్రైనింగ్ కంప్లీట్ చేసిన ఎన్‌టీసీ సర్టిఫికెట్ కలిగిన విద్యార్థులు అన్ని ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరుకావాలని కోరారు. వివరాలకు ఫోన్ నెంబర్ 8639230775 నెంబర్‌కు సంప్రదించాలన్నారు.

తెగుళ్లు, పురుగుల నివారణకు రసాయనాల వాడకం హానికరం

ఉప్పలగుప్తం, ఫిబ్రవరి 7: కొబ్బరి చెట్లను ఆశించే తెగుళ్లు, పురుగుల నివారణకు రసాయనాల వాడకం హానికరమని, జీవ నియంత్రణ విధానాలే క్షేమదాయకమని అఖిల భారత కొబ్బరి సమన్వయ పథకం జీవ నియంత్రణ విభాగం (బెంగళూరు) నోడల్ అధికారి పి.శివకుమార్ అన్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఉప్పలగుప్తం మండలం సన్నవిల్లిలో సర్పంచ్ చిక్కం జంగమయ్య అధ్యక్షతన బుధవారం జరిగిన కొబ్బరి రైతుల సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కొబ్బరి చెట్లను నల్లముట్టి పురుగు ఆశించడంతో ఆదాయం కోల్పోయిన సన్నవిల్లి రైతులను ఆదుకునేందుకు అంబాజీపేట కొబ్బరి పరిశోధనా కేంద్రం శాస్త్రవేత్తలు నోడల్ అధికారిని రప్పించి పరిస్థితిని ప్రత్యక్షంగా చూపించారు. శివకుమార్ మాట్లాడుతూ అవసరాన్ని అనుసరించి బ్రాకాన్ బ్రెవికార్నిస్, గోనియోజస్ నెఫాంటిడిస్ మిత్ర పురుగులను ప్రయోగించడం ద్వారా నల్లముట్టిని తుదముట్టించవచ్చన్నారు. అయితే బదనికకు కనీసం రూపాయి వంతున ఎకరాకు రూ.300 రైతులు వాటాగా చెల్లిస్తే బదనికల సరఫరా సాధ్యపడుతుందని కొబ్బరి పరిశోధనా కేంద్రం ప్రిన్సిపల్ సెంటిస్ట్ ఎన్‌బీవీ చలపతిరావు చెప్పారు. దేశంలోని అన్ని ప్రాంతాలకు అంబాజీపేట పరిశోధనా కేంద్రం నుంచే మిత్ర పురుగులను పంపిణీ చేస్తామన్నారు. అందరూ చిన్నకారు రైతులేనని, ఉచితంగా బదనికలు ఇవ్వాలని సర్పంచ్ జంగమయ్య కోరారు. ఇందుకోసం అంబాజీపేట కేంద్రానికి ఆర్థిక వనరులు సమకూర్చాలని నోడల్ అధికారి శివకుమార్‌ను సర్పంచ్ అభ్యర్థించారు. తన వంతు ప్రయత్నిస్తానని శివకుమార్ భరోసా ఇచ్చారు. నల్లముట్టి పురుగు వ్యాప్తి, లక్షణాలు, సామూహిక నివారణ పద్ధతులపై ఎంటమాలజిస్టు వి.అనూష రైతులకు అవగాహన కల్పించారు. అనంతరం శివకుమార్‌తో పాటు శాస్త్రవేత్తలు కొబ్బరి చెట్లపై మిత్ర పురుగులను ఎలా వదలాలో రైతులకు ప్రయోగాత్మకంగా చూపించారు. సదస్సులో ఎంపీటీసీ వంగా గిరిజానాగకుమారి, చిక్కం నాగబాబు, ఉద్యానవన శాఖ జిల్లా అధికారి బీవీ రమణ, ప్లాంట్ పేథాలజీ సైంటిస్టు బి.నీరజ, ఉద్యానవన శాఖాధికారిణి ఎం.శైలజ, మాజీ సర్పంచ్ గనిశెట్టి వీరాస్వామినాయుడు, గనిశెట్టి సద్గురురావు, నిమ్మకాయల రాము పాల్గొన్నారు.


రైతు సదస్సులో మాట్లాడుతున్న శివకుమార్

భీష్మ ఏకాదశి ఏర్పాట్లపై సమీక్ష


సమీక్ష నిర్వహిస్తున్న ఈవో రామచంద్రమోహన్

అన్నవరం, ఫిబ్రవరి 7: ప్రముఖ పుణ్యక్షేత్రమైన సత్యదేవుడి సన్నిధికి ఈనెల 20న భీష్మ ఏకాదశి పర్వదినం సందర్భంగా అసంఖ్యాకంగా విచ్చేసే భక్తులకు కల్పించాల్సిన సౌకర్యాలు, వైదిక కార్యక్రమాల నిర్వహణపై బుధవారం ఈవో రామచంద్రమోహన్ వైదిక కమిటీ సభ్యులు, ఏఈవోలు, సూపరింటెండెంట్‌లతో సమావేశమయ్యారు. సుమారు లక్ష మంది విచ్చేస్తారని, 15 వేల వ్రతాలు జరుగుతాయని అంచనా వేస్తున్నారు. దీనికనుగుణంగా రెండుగంటల నుంచి వ్రతాలు, మూడు గంటల నుంచి సర్వదర్శనాలు ప్రారంభించాలని నిర్ణయించారు. భక్తులకు ఎక్కడా అసౌకర్యం కలగకుండా అన్ని విభాగాల సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని సూచించారు. క్యూలైన్ వ్యవస్థ పటిష్టంగా ఉండాలని భక్తులకు పులిహోర, దద్ధోజనం ప్రసాదాన్ని ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం మూడు గంటల వరకు పంపిణీ చేయాలని సూచించారు. కార్యక్రమంలో ప్రధానార్చకులు కోట సుబ్రహ్మణ్యం, ఇంద్రగంటి నరసింహమూర్తి, ఏఈవోలు కృష్ణారావు, జగ్గారావు, సూపరింటెండెంట్‌లు కృష్ణప్రసాద్, కంచి మూర్తి, బలువు సత్యశ్రీనివాస్, ఇంజనీరింగ్ అధికారులు బాలమురళీ, నరసింహారెడ్డి, బీఎస్ రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

మోటార్‌సైకిల్‌ను ఢీకొన్న లారీ

భార్య మృతి..భర్తకు తీవ్రగాయాలు


బైక్‌ను ఢీకొన్న లారీ


అపర్ణ(ఫైల్ ఫోటో)

పిఠాపురం, ఫిబ్రవరి 7: కాకినాడ జిల్లా పిఠాపురం బైపాస్‌రోడ్డులో బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో భార్య మరణించగా, భర్తకు తీవ్ర గాయాలయ్యాయి. కొత్తపల్లి మండలం కొత్తమూలపేటకు చెందిన ఆర్ఎంపీ వైద్యుడు చిందాడ నాగేశ్వరరావు తన భార్య అపర్ణ(40)కు అనారోగ్యంగా ఉండటంతో కాకినాడలోని ప్రైవేటు ఆసుపత్రికి తీసుకువెళ్లారు. అక్కడ చికిత్స చేయించుకుని మోటార్‌సైకిల్‌పై తిరిగి ఇంటికి బయలుదేరారు. పిఠాపురం పాదగయ క్షేత్రం వద్ద మలుపు తిరుగుతుండగా కాకినాడ నుంచి కత్తిపూడి వైపు వెళుతున్న లారీ వేగంగా ఢీకొట్టింది. మోటార్‌సైకిల్‌ను 50 అడుగుల దూరం ఈడ్చుకువెళ్లింది. ప్రమాదంలో అపర్ణ అక్కడికక్కడే మరణించగా, నాగేశ్వరరావుకు తీవ్ర గాయాలయ్యాయి. నాగేశ్వరరావును పిఠాపురం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. వీరికి కుమారుడు, కుమార్తె ఉన్నారు. పిఠాపురం పట్టణ ఎస్ఐ మురళీమోహన్, హైవే మొబైల్ పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు.

లోక్ అదాలత్‌లో అత్యధిక ఎక్సైజ్ కేసులు పరిష్కారమవ్వాలి

ఉమ్మడి జిల్లా ప్రధాన న్యాయాధికారి సునీత


సమావేశంలో మాట్లాడుతున్న సునీత

రాజమహేంద్రవరం, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): మార్చి 9న నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్‌లో రాజీ పడదగిన ఎక్సైజ్ కేసులు పెద్ద సంఖ్యలో పరిష్కారమయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రధాన న్యాయాధికారి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి గంధం సునీత ఆదేశించారు. ఈ మేరకు తూర్పు గోదావరి, కాకినాడ, కోనసీమ జిల్లాల ఎక్సైజ్, స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో అధికారులతో బుధవారం సమావేశం నిర్వహించారు. పెండింగ్‌లో ఉన్న ఎక్సైజ్ కేసుల జాబితాను జిల్లా న్యాయ సేవాధికార సంస్థకు అందజేయాలని సూచించారు. సమావేశంలో తూర్పు గోదావరి సెబ్ అడిషనల్ ఎస్పీ పి.సోమశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి పోలింగ్ కేంద్రంలో మౌలిక సదుపాయాలు కల్పించాలి

సబ్ కలెక్టర్ ఎస్.ప్రశాంత్‌కుమార్


సమావేశంలో మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ ప్రశాంత్‌కుమార్

రంపచోడవరం, ఫిబ్రవరి 7: రానున్న సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి ప్రతి పోలింగ్ కేంద్రంలో మౌలిక సదుపాయాలు కల్పించేలా చర్యలు చేపట్టాలని సబ్ కలెక్టర్ ఎస్.ప్రశాంత్‌కుమార్ అధికారులను ఆదేశించారు. బుధవారం ఆయన స్థానిక తహసీల్దారు కార్యాలయంలో సెక్టార్, బూత్ స్థాయి అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టరు మాట్లాడుతూ ప్రతి పోలింగ్ కేంద్రంలో విద్యుత్, మరుగుదొడ్లు, రన్నింగ్ వాటర్ సదుపాయం కల్పించాలన్నారు. సెక్టారు అధికారులు తరచూ పోలింగ్ కేంద్రాలను పరిశీలించాలని, సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై సమాచారం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో తహశీల్దారు ఎ.కృష్ణజ్యోతి, డీటీ ఎస్‌వీవీ సత్యనారాయణ, బి.రాజు, సీనియర్ అసిస్టెంట్లు ఇందిరాబాయి, లక్ష్మణ్, చెల్లాయమ్మ, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ విఘ్నేష్ తదితరులు పాల్గొన్నారు.

రాయుడుపాలెంలో వివాహిత అనుమానాస్పద మృతి

భర్తే చంపేశాడని తల్లిదండ్రుల ఆరోపణ

అరెస్టు చేయాలంటూ జీజీహెచ్ వద్ద ఆందోళన

సర్పవరం జంక్షన్, ఫిబ్రవరి 7: కాకినాడ రూరల్ మండలం రాయుడుపాలానికి చెందిన వివాహిత బొండాడ హారికాలక్ష్మి (23) అనుమానాస్పద స్థితిలో మృతి చెందింది. ప్రేమించి పెళ్లి చేసుకుని, అదనపు కట్నం కోసం వేధిస్తూ, చివరకు కట్టుకున్న భార్యను పీకకు ఉరేసి చంపేసి ఆత్మహత్యగా భర్త చిత్రీకరించాడని హారిక తల్లిదండ్రులు గొర్ల రాజు,మణి ఆరోపించారు. తక్షణమే అల్లుడిని అరెస్ట్ చేసి న్యాయం చేయాలని జీజీహెచ్ వద్ద ఆందోళన చేపట్టారు. రాయుడుపాలెం, పిఠాపురానికి చెందిన బొండాడ జాషువ, హారిక ప్రేమించి పెళ్లి చేసుకున్నారు. వివాహం జరిగిన కొద్దిరోజుల నుంచి అదనపు కట్నం కోసం భార్యను జాషువా వేధింపులకు గురి చేసేవాడు. ఈ క్రమంలో ఈనెల 5వ తేదీన ఉదయం 9.30 గంటల సమయంలో హారిక స్నానం చేయడానికి వెళ్లగా కరెంట్ షాక్ తగిలి చేతులు మెడ, కాలిపోయిందని, ఆసుపత్రికి తీసుకెళుతున్నట్లు హారిక తల్లిదండ్రులకు జాషువ సమాచారం అందించి, జీజీహెచ్‌కు తీసుకెళ్లాడు. అక్కడ చికిత్స పొందుతూ అదేరోజు సోమవారం సాయంత్రం హారిక మృతి చెందింది. అదనపు కట్న కోసం కావాలనే తమ కుమార్తె మెడకు ఉరేసి, చేతులు కాల్చివేసి కరెంట్ షాక్ నెపంతో తమ అల్లుడు హత్యకు పాల్పడి నాటకం ఆడుతున్నాడని హారిక తల్లిదండ్రులు ఆరోపించారు. బుధవారం జీజీహెచ్ మార్చురీ వద్ద ఆందోళన చేశారు. అరెస్ట్ చేసే వరకు మృతదేహానికి పోస్ట్‌మార్టం నిర్వహించేందుకు అనుమతించడం కుదరదంటూ పోలీసులకు చెప్పారు. తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సర్పవరం ఎస్ఐ వి.శ్రీనివాస్ తెలిపారు.


ఊయలలో లేగదూడను ఉంచి పండుగ చేస్తున్న దృశ్యం

లేగదూడకు ఊయల వేడుక

పెరవలి, ఫిబ్రవరి 7: పెరవలి మండలం ముక్కామలకు చెందిన అఖండ వెంకటేశ్వరరావు గోవులను ఎంతో అల్లారుముద్దుగా పెంచుకుంటారు. దీంతో ఆయన వద్ద ఉన్న ఆవుకు ఒక దూడ కూడా పుట్టింది. ఈ మేరకు 21వ రోజున ఉయ్యాల వేడుకను ఘనంగా నిర్వహించారు.శాస్త్రోక్తంగా ఊయల ఏర్పాటు చేసి పూలతో అలంకరించి ఆ ఊయాల్లో దూడను ఉంచి ఎంతో ఆనందంగా వేడుకలు జరిపారు. బంధువులు తరలివచ్చి ఆశీర్వదించారు.

వెంకన్న ఒక్కరోజు ఆదాయం రూ.1.68 లక్షలు

ఆత్రేయపురం, ఫిబ్రవరి 7: కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీవేంకటేశ్వరస్వామిని బుధవారం అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. వివిధ సేవల ద్వారా ఒక్కరోజు ఆదాయం రూ.1,68,544 లభించినట్టు ఈవో ముదునూరి సత్యనారాయణరాజు తెలిపారు. భక్తులకు ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు.

ఎడ్ల బండిని ఢీకొన్న ఆటో

ఆటో డ్రైవర్ దుర్మరణం

కొవ్వూరు, ఫిబ్రవరి 7 : కుక్కను తప్పించబోయి ఎడ్ల బండిని ఢీకొని ఆటో డ్రైవర్ మృతిచెందినట్టు కొవ్వూరు పట్టణ సీఐ వి.జగదీశ్వరరావు తెలిపారు. చాగల్లు మండలం మల్లవరం గ్రామానికి చెందిన మల్లిన సత్యనారాయణ (45) ప్రతిరోజు మల్లవరం నుంచి రాజమహేంద్రవరం సర్వీస్ ఆటో నడుపుకుంటూ జీవిస్తున్నాడు. ప్రతిరోజు మాదిరిగా ఈ నెల 6వ తేదీన సత్యనారాయణ రాజమహేంద్రవరం వెళ్లి తిరిగి ఇంటికి వస్తున్నాడు. అర్థరాత్రి 2 గంటల సమయంలో కొవ్వూరు మండలం వేములూరు సాయిబాబా గుడి సమీపానికి వచ్చేసరికి అడ్డుగా వచ్చిన కుక్కను తప్పించబోయి ఆటోతో ఎదురుగా వస్తున్న ఎడ్ల బండిని ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో ఆటోడ్రైవర్ సత్యనారాయణకు ఎడ్లబండి కాడ తలకు తగలడంతో తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు 108 అంబులెన్స్‌లో కొవ్వూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా మృతి చెందినట్టు ధ్రువీకరించారు. సత్యనారాయణ భార్య పద్మ ఫిర్యాదుపై కేసునమోదు చేసినట్టు సీఐ జగదీశ్వరరావు తెలిపారు. సత్యనారాయణకు ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

మద్యం షాపు తరలించాలని ధర్నా

అమలాపురం టౌన్, ఫిబ్రవరి 7: పట్టణంలోని 14వ వార్డు పరిధిలో శ్రీరాంపురంలో ప్రభుత్వ మద్యం దుకాణాన్ని తరలించాలంటూ స్థానిక మహిళలతో కలిసి టీడీపీ, జనసేన నాయకులు రెండో రోజైన బుధవారం ధర్నా కొనసాగించారు. ప్రభుత్వ మద్యం దుకాణం వల్ల ఎదుర్కొంటున్న ఇబ్బందులను ఆ ప్రాంత ప్రజలు వివరించారు. టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి అయితాబత్తుల ఆనందరావు, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మెట్ల రమణబాబు, మాజీ కౌన్సిలర్ వాసంశెట్టి సత్యం, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి శెట్టిబత్తుల రాజబాబు, తెలుగు మహిళా జిల్లా అధ్యక్షురాలు పెచ్చెట్టి విజయలక్ష్మి, మాకిరెడ్డి వీఎన్ఎస్ పూర్ణిమ తదితరులు ధర్నాలో పాల్గొన్నారు. ఎక్సైజ్ అధికారులతో పాటు పట్టణ సీఐ కె.క్రిస్టఫర్ ఆధ్వర్యంలో సిబ్బంది అక్కడకు చేరుకుని వారితో చర్చలు జరిపారు. త్వరలోనే షాపును అక్కడి నుంచి తరలిస్తామని హామీ ఇవ్వడంతో ధర్నా విరమించారు.



ఏజెన్సీ సమాచారం

చిరు ధాన్యాలను పండించాలి

వై.రామవరం,ఫిబ్రవరి7: రైతులు చిరుధాన్యాలు, చిక్కుడు జాతి విత్తనాలు, పప్పు దినుసులు తదితర సంప్రదాయ పంటలను పండించాలంటూ రైతులకు శాస్త్రవేత్తలు విజ్ఞప్తి చేశారు. మండలంలోని గుమ్మరిపాలెం గ్రామంలో బుధవారం లయ స్వచ్ఛంద సంస్థ (అడ్డతీగల) ఆధ్వర్యంలో నిర్వహించిన 17వ సేంద్రియ వ్యవసాయ జీవ వైవిధ్య సదస్సులో అరటి పరిశోధన సంస్థ కొవ్వూరు నుంచి వచ్చిన సైంటిస్టులు వివరించారు. అంతరించిపోతున్న చిరుధాన్యాల పంటలను మళ్లీ కాపాడుకోవాలని రసాయన ఎరువుల పద్ధతులను విడనాడి సేంద్రియ వ్యవసాయాన్ని ముందుకు తీసుకువెళ్లాలని పేర్కొన్నారు. లయ సంస్థ నుంచి సహజ వనరుల యాజమాన్యం విభాగం మేనేజర్ కె.కోటేశ్వరరావు రైతులకు పలు సూచనలు చేశారు. అనంతరం ఆయా పంటల వివరాలపై జీవ వైవిధ్య ఎగ్జిబిషన్‌ను ప్రదర్శించారు. అనంతరం ఆదర్శ రైతులను గుర్తించి వారికి సన్మానం చేశారు. కార్యక్రమంలో బుర్రి చక్రబాబు, ఆకుల పద్మావతి, అల్లూరి జిల్లా, పార్వతీపురం మన్యం జిల్లాల నుంచి సుమారు 260 మంది ఆదివాసీ రైతులు, పంచాయతీ సర్పంచులు పాల్గొన్నారు.

పేదలకు న్యాయం జరిగేలా సహాయపడాలి: పీవో



పీవోను కలిసిన లా విద్యార్థులు

రంపచోడవరం, ఫిబ్రవరి 7: పేద, బడుగు బలహీన వర్గాలకు న్యాయం జరిగేలా సహాయ పడాలని ఐటీడీఏ పీవో సూరజ్ గనోరే లా విద్యార్థులకు సూచించారు. స్థానిక ఐటీడీఏ కార్యాలయ సమావేశపు హాలులో కాకినాడ పీఎస్ఆర్ కళాశాలలో చదువుతున్న లా విద్యార్థులు పీవోను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఐటీడీఏ పీవో విద్యార్థులకు ఏజెన్సీ చట్టాలపై అవగాహన కల్పించారు. ఏజెన్సీలో గిరిజనులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక చట్టాలు ఏర్పాటు చేశాయని, అందులో భాగంగానే ఐటీడీఏలను స్థాపించినట్లు తెలిపారు. కార్యక్రమంలో మొబైల్ కోర్టు మేజిస్ట్రేట్ జాన్‌రాజ్, పీఎస్ఆర్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సంగీత పాల్గొన్నారు.

ఉపాధ్యాయ పోస్టుకు దరఖాస్తు చేసుకోవాలి

రంపచోడవరం, ఫిబ్రవరి 7: రాజవొమ్మంగి ఏపీ గిరిజన గురుకుల సంక్షేమ పాఠశాల (బాలికలు)లో ఖాళీగా ఉన్న టీజీటీ-ఇంగ్లీషు ఉపాధ్యాయ పోస్టుకు ఔట్ సోర్సింగ్ పద్ధతిలో పనిచేసేందుకు అర్హులైన స్త్రీ అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ఐటీడీఏ పీవో సూరజ్ గనోరే తెలిపారు. అభ్యర్థులు సంబంధిత సబ్జెక్టులో గ్రాడ్యుయేషన్/ పోస్టు గ్రాడ్యుయేషన్, బీఈడీలో 50 శాతం ఉత్తీర్ణత సాధించి ఉండాలన్నారు. ఏపీ టెట్ క్వాలిఫై అయి రెండు లెవెల్స్ ఇంగ్లీషు మీడియం చదివి ఉండాలన్నారు. అప్లికేషన్లను ఐటీడీఏ కార్యాలయంలోని గురుకులం సెల్‌లో ఈ నెల 10వ తేదీలోగా అందజేయాలన్నారు. ఇంటర్వ్యూను ఈనెల 12వ తేదీన ఐటీడీఏ కార్యాలయంలో మధ్యాహ్నం 3 గంటలకు నిర్వహించనున్నట్లు తెలిపారు.

తహశీల్దార్‌ను కలిసిన జనసేన నేతలు



అభినందనలు చెబుతున్న నాయకులు

వరరామచంద్రాపురం, ఫిబ్రవరి 7: తహసీల్దార్‌గా ఇటీవల బాధ్యతలు చేపట్టిన సయ్యద్ మౌలానాఫాజిల్‌ను మండల జనసేన నాయకులు బుధవారం మర్యాద పూర్వకంగా కలసి అభినందనలు తెలిపారు. మండల అధ్యక్షుడు ములకాల సాయికృష్ణ, కనుగుల శ్రీనివాస్‌రెడ్డి, బాగుల ప్రమీల, కెచ్చెల పోసిరెడ్డి, బాగుల అంజన్‌రావు, సాగర్, కోట్ల రాజిరెడ్డి, పెట్టా నాగేంద్రబాబు, రేవు దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నులి పురుగుల నివారణ పోస్టర్ ఆవిష్కరణ



రంగంపేట, ఫిబ్రవరి 7: ఈ నెల 9న జరుపుకునే జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవం సంబంధించిన పోస్టర్‌ను బుధవారం రంగంపేట మండల పరిషత్ కార్యాలయంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి కె.వెంకటేశ్వరరావు, విడుదల చేశారు. విద్యాశాఖాధికారి కె.శ్రీనివాసరావుకు ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు పంపిణీ చేసేందుకు నులిపురుగుల నిర్మూలన మాత్రలను అందించారు. అనంతరం రంగంపేట ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసి,రికార్డులను పరిశీలించారు. జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారిణి రాజకుమారి ఎంపీడీవో వెంకటేశ్వరరావు, పీహెచ్‌సీ వైద్యులు బి.వేణులక్ష్మీ, కె.చిన్నారావు, ఎంఈవో కె.శ్రీనివాసరావు,సీహెచ్‌వో జయమణి,ఎంపీహెచ్ఈవో పి.ప్రసాద్,ఎంపీహెచ్ఎస్ పి.రాజ్యేశ్వరరావు,పిఎస్ఎస్ కుమారి,పి.నాగలక్ష్మీ, మణికంఠ పాల్గొన్నారు.

నులి పురుగుల నివారణపై అవగాహన



నులిపురుగు నివారణపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

సీతానగరం,ఫిబ్రవరి 7: మండలంలోని పలు పాఠశాలలో జాతీయ నులి పురుగు నిర్మూలనా కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. బుధవారం చినకొండేపూడి విజయదుర్గ పబ్లిక్ స్కూల్లో ఈ నెల 9న నిర్వహించే జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమంపై పీహెచ్‌సీ వైద్యులు ఏవీకే చైతన్య విద్యార్థులకు అవగాహన కల్పించారు. అంగన్‌వాడీ సెంటర్లలోను,ప్రభుత్వ, ప్రైవేటు స్కూల్స్, కళాశాలలో విద్యార్థులచే మింగించాలన్నారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యులు ఎస్ రాజు, ఎంపీహెచ్ఈవో వై. సుబ్బారాయుడు, సూపర్‌వైజర్లు, సుధాకర్, జి.దైవకృప పాల్గొన్నారు.

ఉపాధి పనుల పరిశీలన

గోకవరం, ఫిబ్రవరి 7: మండలంలోని అచ్చుతాపురంలో అంబటివారి చెరువులో జరుగుతున్న ఉపాధి పనులను బుధవారం డ్వామా పీడీ మొఖలింగం పరిశీలించారు. బత్తుల దుర్గారావు అనే రైతు పొలంలో వైఎస్సార్ జలకళలో భాగంగా ఏర్పాటుచేసిన బోరు పనులు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. బోరు ఏర్పాటు వల్ల బీడు భూమిగా మారిన తన భూమి పండ్లు, ఫామాయిల్ తోటలతో కళకళలాడుతుందని రైతు దుర్గారావు పీడీ వద్ద హర్షం వ్యక్తం చేశారు. అనంతరం కూలీల వివరాలను తెలుసుకోవడంతోపాటు, వేతనం ఎంతగిట్టుబాటు అవుతుందో ఆయన అడిగి తెలుసుకున్నారు. తదనంతరం పీడీ ఉపాధి హామీ కార్యాలయాన్ని సందర్శించి రికార్డులను పరిశీలించారు. ఈకార్యక్రమంలో ఏపీడీ బి.రాంప్రసాద్, ఏపీవో పీఎస్.అప్పలరాజు, జేఈ రత్నరాజు, సిబ్బంది పాల్గొన్నారు.

10వేల మంది మహిళలకు శిక్షణ

కడియం, ఫిబ్రవరి 7: రాబోయే ఐదేళ్లలో తూర్పు, పశ్చిమ, కృష్ణ, విశాఖ జిల్లాల పరిధిలో పదివేల మంది మహిళలను ఎంటర్‌ప్రెన్యూర్‌గా తీర్చిదిద్దేందుకు తమసంస్థ కృషి చేస్తుందని గ్రామీణ ఫౌండేషన్ ఇండియా స్వచ్ఛంద సేవాసంస్థ ప్రతినిధులు గజేంద్రరాయ్, డాక్టర్ బీనాలు తెలిపారు. వ్యవసాయంపై ఆధారపడిన మహిళలు ఎంటర్‌ప్రెన్యూర్‌గా ఎదగాలని తమ సంస్థ ఆలోచిస్తుందన్నారు. జనరేటింగ్ రూరల్ ఆపర్చునిటీస్ ఫర్ ఉమెన్ టు విన్ ఇన్ అగ్రి ఎంటర్‌ప్రెన్యూర్ షిప్ (గ్రో) ప్రోగ్రాంలో బాగంగా సంస్థ ప్రతినిధులు బుధవారం దుళ్ళలో చిట్టూరి చౌదరి వ్యవసాయక్షేత్రంలో రైతులతో ముఖాముఖి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు చంద్రశేఖర్‌రావు, ఆర్ శ్రీనివాసరావు, పి.ప్రశాంత్, శ్రీనివాస్, అమలేశ్వరి, మాజీ సర్పంచ్ గుర్రపు సత్యనారాయణ, స్థానిక రైతులు పాల్గొనారు.

విద్యార్థినులకు దంత వైద్య పరీక్షలు

రాజమహేంద్రవరం అర్బన్, ఫిబ్రవరి 7 : రాజమహేంద్రి మహిళా జూనియర్, డిగ్రీ, పీజీ కళాశాల విద్యార్థినులకు బుధవారం కళాశాలలో దంత వైద్య పరీక్షలు నిర్వహించారు. శ్రీవాణి దంతవైద్యశాల డాక్టర్ శ్రీవాణి దంతాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ టీకే విశ్వేశ్వరరెడ్డి మాట్లాడుతూ మంచి ఆరోగ్యానికి దంత సంరక్షణ చాలా అవసరమని అన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ సత్యసౌందర్య, కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ల పీవోలు ఎంకేఎస్ ప్రసాద్, కె.సుధారాణి, దంతవైద్యశాల సిబ్బంది ప్రసాద్, సాయికుమార్, వలంటీర్లు, కళాశాల విద్యార్థినులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఓటరు జాబితాలో తప్పిదాలకు తావుండరాదు



బీఎల్‌వోల శిక్షణా కార్యక్రమంలో మాట్లాడుతున్న కలెక్టర్ మాధవీలత

బీఎల్‌వోల శిక్షణలో జిల్లా కలెక్టర్ మాధవీలత

రాజమహేంద్రవరంరూరల్, ఫిబ్రవరి7: ఓటరు జాబితాలో ఓటరు పేరు, ఫోటో గుర్తింపు ఉండే విధంగా బీఎల్‌వోలు వ్యక్తిగత బాధ్యతతో పరిశీలించి నిర్ధారణ చేసుకోవాలని ఓటరుజాబితాలో ఎటువంటి తప్పిదాలకు తావులేకుండా ఉండాలని జిల్లా కలెక్టర్ మాధవీలత పేర్కొన్నారు. రాజమహేంద్రవరం రూరల్ మండలం రాజవోలులో రాజమహేంద్రవరంరూరల్ నియోజకవర్గం బీఎల్‌వోలు, ఇతర ఎన్నికల అధికారులతో ఓటరు జాబితా అనుబంధ అంశాలపై రిటర్నింగ్ అధికారి తేజ్‌భరత్‌తో కలిసి శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాధవీలత మాట్లాడుతూ ఓటరు జాబితా రూపకల్పనలో బాధ్యత బీఎల్‌వోలదే అన్నారు. క్షేత్రస్థాయిలో బీఎల్‌వోలు వారి పరిధిలో గల పోలింగ్ కేంద్రాలలో అన్ని మౌలిక సదుపాయాలు ఉండేలా చూసుకోవాల్సి ఉందన్నారు. రూరల్ నియోజకవర్గం రిటర్నింగ్ అధికారి తేజ్‌భరత్ మాట్లాడుతూ ఎన్నికల ప్రక్రియలో అర్హతగల ఓటరు తమ ఓటుహక్కును వినియోగించడంలో ఓటరు జాబితా పారదర్శకంగా ఉండాలన్నారు. ఓటరు జాబితా విషయంలో మన నియోజకవర్గం రోల్‌మోడల్‌గా ఉండాలన్నారు. కేంద్రాలకు కావలసిన ఫర్నీచర్, లైటింగ్ తాగునీరు వంటి వసతులు సమకూర్చేవిధంగా చర్యలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో కొవ్వూరు సబ్‌కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ, సహాయ కలెక్టర్ యస్వంత్‌కుమార్, ఆర్డీవో ఎ.చైత్రవర్షిణి, ఈఆర్‌వో సరళా వందన్ప కడియం, రూరల్ తహసీల్దార్లు, బి.రమాదేవి, వైకెవీ అప్పారావు, బీఎల్‌వోలు తదితరులు పాల్గొన్నారు.

సాధారణ ఎన్నికలు సక్రమంగా జరిగేలా చర్యలు చేపట్టాలి

● స్టేట్ చీఫ్ ఎలక్టోరల్ అధికారి ముఖేష్‌కుమార్ మీనాకు రామకృష్ణారెడ్డి ఫిర్యాదు



వెలగపూడిలో రాష్ట్ర ముఖ్య ఎలక్టోరల్ అధికారికి ఫిర్యాదు చేస్తున్న రామకృష్ణారెడ్డి

అనపర్తి, ఫిబ్రవరి 7: అనపర్తి నియోజకవర్గంలో త్వరలో జరుగనున్న సాధారణ ఎన్నికలు సజావుగా జరిగే విధంగా చర్యలు చేపట్టాలని ఇటీవల బిక్కవోలు మండలంలో జరిగిన ఎన్నికల నియమావళి ఉల్లంఘనపై చర్యలు చేపట్టాలని బుధవారం వెలగపూడిలోని స్టేట్‌చీఫ్ ఎలక్టోరల్ అధికారి ముఖేష్‌కుమార్ మీనాకు టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నల్లమిల్లి రామకృష్ణారెడ్డి ఫిర్యాదు చేశారు. అనపర్తి నియోజకవర్గంలో కొందరు అధికారులు వైసీపీ నాయకులకుతొత్తులుగా వ్యవహరిస్తున్నారని ఎన్నికల నియమావళిని ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని ఆయన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఇటీవల బిక్కవోలు మండల తహసీల్దార్‌గా విధులు నిర్వహించి ఎన్నికల బదిలీలలో భాగంగా బదిలీపై వెళ్లిన పోసిబాబు ఐదు రోజుల తరువాత బిక్కవోలు వచ్చి ఇండ్ల పట్టాలపై పాత తేదీలలో సంతకాలు చేసి నిబంధనలు ఉల్లంఘించారని ఇదే విషయాన్ని స్థానిక వీఆర్‌వో అశోక్ మీడియా ముందు ఒప్పుకున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. అదేవిధంగా బిక్కవోలు మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో ఎంపీపీ భర్త, జెడ్‌పీటీసీ భర్త పాల్గొని రాజకీయ ప్రసంగాలు చేశారని ఇంత జరుగుతున్నా ఎంపీడీవో నిలువరించే ప్రయత్నం చేయలేదని దీనిపై కూడా విచారణ చేసి చర్యలు చేపట్టాలని ఆయన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన వెంట శాసనమండలి మాజీ చైర్మన్ షరీఫ్ ఉన్నారు.

రమాబాయి అంబేడ్కర్‌కు ఘన నివాళి



అంబేడ్కర్ విగ్రహం వద్ద రమాబాయి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దళిత నేతలు

రాజమహేంద్రవరం సిటీ, ఫిబ్రవరి 7: అంబేడ్కర్ విజయం వెనుక ఆయన భార్య రమాబాయి సహకారం ఉందని వైసీపీ నాయకురాలు జక్కంపూడి విజయలక్ష్మి అన్నారు. రాజమహేంద్రవరం రాజేంద్రనగర్ సచివాలయం వద్ద అంబేడ్కర్ స్టూడెంట్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో రమాబాయి అంబేడ్కర్ 126వ జయంతిని ఘనంగా నిర్వహించారు. రమాబాయి చిత్రపటానికి పూలమాలతో నన్నయ్య యూనివర్శిటీ ప్రొఫెసర్ డాక్టర్ మల్లీ భాస్కర్, స్టూడెంట్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు తాడేపల్లి విజయకుమార్, నాయకులు దివ్య, సంధ్య, ఉమాదేవి, నాగమణి, మల్లీశ్వరి, సత్యవతి, జీవన్, నారాయణ నివాళులర్పించారు.గోకవరం బస్టాండ్ అంబేడ్కర్ విగ్రహంవద్ద రమాబాయి అంబేడ్కర్ జయంతిని రాష్ట్ర ఎస్సీఎస్టీ ఉద్యోగుల సంఘం నాయకుడు కోరుకొండ చిరంజీవి నిర్వహించారు. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు తాళ్ళూరి బాబు రాజేంద్రప్రసాద్, ధార ఏసురత్నం, పాటి రామారావు, ఏలేటి రాజారావు, ఖండవిల్లి లక్ష్మి, పి.ప్రశాంతి, జువ్వల రాంబాబు, పాము బాబురావు రమాబాయి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

'అభివృద్ధి అంటే రాళ్లు, లైట్లు, రంగులు కాదు'



సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ నగర ప్రధాన కార్యదర్శి బుడ్డిగ రాధ

రాజమహేంద్రవరంసిటీ ఫిబ్రవరి 7: అభివృద్ధి అంటే రాళ్ళు, లైట్లు, రంగులు కాదని వైసీపీ నాయకులు తెలుసుకోవాలని టీడీపీ నగర ప్రధాన కార్యదర్శి బుడ్డిగ రాధా విమర్శించారు. రాజమండ్రి ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 16 ఏళ్ళ పాలనలో ఆదిరెడ్డి కుటుంబం రాజమహేంద్రవరానికి ఏమిచేసిందో ప్రజలకు తెలుసునని మీకు చెప్పాల్సిన అవసరం లేదన్నారు. కాదు మీరు తెలుసుకోవాలనుకుంటే మా వద్ద ఆధారాలతో ఉన్నాయన్నారు. వైసీపీ నాయకులు రాజమహేంద్రవరంలో జరిగిన అవినీతి అక్రమాలుపై శ్వేతపత్రాలతో వస్తే తేల్చుకుందామని సవాల్ చేశారు. రాజమహేంద్రవరానికి ఎంపీ భరత్ రామ్ చేసిందేమిటని ప్రశ్నించారు. టీడీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి ఈతలపాటి కృష్ణ, తెలుగుయువత నగర అధ్యక్షుడు ఉర్లంకల లోకేశ్ మాట్లాడుతూ వైసీపీ తట్ట బుట్ట సర్దుకునే సమయం ఆసన్నమైందన్నారు. సమావేశంలో టీడీపీ సీనియర్ నాయకుడు కరగాని వేణు, టీఎన్‌టీయూసీ నగర ప్రధాన కార్యదర్శి మిస్కా జోగినాయుడు, పార్లమెంట్ ఉపాధ్యక్షుడు యర్రంశెట్టి రాజ్ కుమార్, తెలుగుయువత నగర కార్యదర్శి దుద్దేటి నాగేంద్ర యాదవ్, నాయకులు ప్రతాప్, రోసంకి రాజు పాల్గొన్నారు.

7వ డివిజన్‌లో టీడీపీ భవిష్యత్తుకు గ్యారెంటీ

వైసీపీ అరాచకాలకు ముగింపు పలికేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. రాజమహేంద్రవరం 7వ డివిజన్‌లో మంగళవారం జరిగిన భవిష్యత్‌కు గ్యారెంటీలో ప్రజలను కలిసి సమస్యలు తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో మాజీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ కోరుమిల్లి విజయశేఖర్ , మహిళా నాయకులు సయ్యద్ అప్సరీ ఆధ్వర్యంలో ప్రధాన కార్యదర్శి బుడ్డిగ రాధా పాల్గొన్నారు.

మహాశక్తి పథకాలతో లబ్ధి

● నియోజకవర్గ తెలుగు మహిళా అధ్యక్షురాలు సూర్యకుమారి

అనపర్తి, ఫిబ్రవరి 7: తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు ప్రకటించిన మినీ మేనిఫెస్టోలోని మహాశక్తి పథకాలు ప్రతి పేద కుటు ంబానికి లబ్ధి చేకూరుస్తాయని నియోజకవర్గ తెలుగు మహిళా అధ్యక్షురాలు జుత్తుగ సూర్యకుమారి అన్నారు. బుధవారం అనపర్తిలో తెలుగు మహిళల ఆధ్వర్యంలో మహాశక్తి పథకాల ప్రచార కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా తెలుగు మహిళలు ఇంటింటికీ వెళ్లి మహాశక్తి పథకాల ద్వారా చేకూరే లబ్ధిని వివరిస్తూ టీడీపీకి ఓటు వేయాలంటూ కోరారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు సిరసపల్లి నాగేశ్వరరావు, కొవ్వూరి శ్రీనివాసరెడ్డి, తమలంపూడి సుధాకరరెడ్డి, ఒంటిమి సూర్య కుమారి, బేరా వేణమ్మ, సిరసపల్లి లక్ష్మి, మల్లేశ్వరి, పోతంశెట్టి సుభాషిణి, చిన్నమ్మ తదితరులు పాల్గొన్నారు.



అనపర్తిలో మహాశక్తి పథకాల ప్రచారం నిర్వహిస్తున్న నియోజకవర్గ తెలుగు మహిళా నేతలు

ప్రతి ఒక్కరూ ట్రాఫిక్‌రూల్స్ పాటించండి

● మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ సంపత్‌కుమార్

అనపర్తి, ఫిబ్రవరి 7 : రహదారి భద్రతతోనే మన జీవన భద్రత ఏర్పడుతుందని ప్రతిఒక్కరూ ట్రాఫిక్ రూల్సు పాటించడం ద్వారా ప్రమాదాలను నివారించవచ్చని సీనియర్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ సంపత్‌కుమార్ అన్నారు. బుధవారం అనపర్తిలోని జీబీఆర్ విద్యా సంస్థల సెమినార్ హాల్‌లో నిర్వహించి భద్రతా వారోత్సవాలలో ఆయన పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా రహదారి భద్రతపై విద్యార్థులకు నిర్వహించిన వ్యాసరచన పోటీలలో విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్లు జి.రాదికాదేవి, ఎస్.సబిత, డాక్టర్ మాదవి, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఎన్‌పీ అబ్బాయిరెడ్డి, డైరెక్టర్లు డీవీఆర్‌ఏ పాపిరెడ్డి, కర్రి హరినాదరెడ్డి, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ పిఆర్ఎల్ స్వామి, కోఆర్డినేటర్లు ఆనందరావు, రామకృష్ణ, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్లు నియమాలు పాటించాలి



ఆటో యూనియన్ సభ్యులకు అవగాహన కల్పిస్తున్న పోలీసులు

కడియం, ఫిబ్రవరి 7: జిల్లా ఎస్పీ పి.జగదీశ్ ఆదేశాల మేరకు దక్షిణ మండల డీఎస్పీ కె.శ్రీనివాసులు పర్యవేక్షణలో కడియం ఇన్‌స్పెక్టర్ బి.తులసీధర్, ఎస్ఐ ఎండీ ఆష్ఫక్, కృష్ణసాయిలు బుధవారం కడియం పోలీస్‌స్టేషన్‌లో ఆటోడ్రైవర్లుకు అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటుచేశారు. ఆటో నడిపే సమయంలో యూనిఫామ్ ధరించాలని, పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకోరాదని, సెల్‌ఫోను మాట్లాడుతూ డ్రైవింగ్ చేయరాదని, ట్రాఫిక్ రూల్స్ పాటించాలని తదితర సూచనలు చేశారు.

రంగాపురం, ఇళ్లపల్లిలో పలు అభివృద్ధి పనులు ప్రారంభం

బిక్కవోలు, ఫిబ్రవరి 7: రంగాపురం, ఇళ్లపల్లి గ్రామాల్లో బుధవారం ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి పలు అభివృద్ధి పనులను ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన రంగాపురం గ్రామంలో గ్రాసిం ఇండస్ట్రీస్ సహకారంతో నిర్మించిన రెండు కళా వేదికలను, రూ. 41 లక్షలతో నిర్మించిన వాటర్ ట్యాంక్, పైపులైనును ప్రారంభించారు. ఇళ్లపల్లి గ్రామంలో గ్రాసిం సహకారంతో నిర్మించిన రూ.45 లక్షలతో నిర్మించిన సచివాలయ భవనం, రూ. 21 లక్షలతో నిర్మించిన రైతు భరోసా కేంద్రాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు గండికోట వీరభద్రరావు, లొల్ల భద్రం, రాజమహేంద్రవరం వైసీపీ ఎంపీ అభ్యర్థి గూడూరు శ్రీనివాస్, జెడ్‌పీటీసీ రొంగల పద్మావతి, వైసీపీ నేతలు రొంగల అప్పాజీ, మురళీకృష్ణ పాల్గొన్నారు.

విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలి

గోకవరం, ఫిబ్రవరి7: ప్రస్తుత పోటీ ప్రపంచంలో సాంకేతికతను వినియోగించుకొని విద్యార్థులు అన్నిరంగాల్లో రాణించాలని బీఎస్ఎన్ఎల్ జనరల్ మేనేజర్ పి.రాజు అన్నారు. మండలంలోని భూపతిపాలెం గురుకుల పాఠశాల ఆవరణలో బుధవారం బీఎస్ఎన్ఎల్ 4జీ టవర్ నిర్మాణపు పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈసందర్భంగా జీఎం రాజు మాట్లాడుతూ టవర్ ఏర్పాటుతో ఇంటర్నెట్ అందుబా టులోకి వస్తోందన్నారు.

క్రీస్తు బోధనలు అనుసరించాలి

● బ్రదర్ అనిల్‌కుమార్ ● రాజకీయ కోణంలోనే వచ్చారా అంటూ చర్చ!



పాస్టర్స్ సమావేశంలో పాల్గొన్న అనిల్‌కుమార్

గోకవరం, ఫిబ్రవరి7: ప్రతీఒక్కరూ క్రీస్తు బోధనలు అనుసరించాలని బ్రదర్ అనిల్‌కుమార్ అన్నారు. గోకవరం మండలం కృష్ణునిపాలెం గ్రామంలో బుధవారం జరిగిన పాస్టర్స్ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈసందర్భంగా క్రైస్తవ సోదరలందరూ క్రీస్తుమార్గంలో నడవాలన్నారు. కాగా ఏపీ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు షర్మిలారెడ్డి భర్త అనిల్‌కుమార్ ఎన్నికల వేళ గోకవరం రావడం, పాస్టర్స్‌తో సమావేశం ఏర్పాటుచేయడం స్థానికంగా చర్చనీ యాంశమైంది. సమావేశంలో రాజకీయ పరమైన అంశాలుపైకి లేవనెత్తపో యినప్పటికీ, లోపాయికారిగా అందుకోసమే వచ్చినట్లు స్థానికులు చర్చిం చుకుంటున్నారు. అనిల్ మాత్రం పాస్టర్స్ సమావేశానికి మాత్రమే వచ్చారని, ఇందులో రాజకీయకోణం లేదని రాష్ట్ర పెంటి కోస్టల్ ఫెలోషిప్ సెక్రటరీ కన్నబాబు చెప్పుకొచ్చారు.

పలు కుటుంబాలకు బత్తుల పరామర్శ



కోరుకొండ, ఫిబ్రవరి7: కోరుకొండ మండలంలో బుధవారం జనసేన ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా కో ఆర్డినేటర్ బత్తుల వెంకటలక్ష్మి బుధవారం పలు గ్రామాల్లో ఓదార్పు యాత్ర నిర్వహించారు. దోసకాయలపల్లి గ్రామంలో పిల్లల గోవిందు ఇటీవల మృతి చెందడంతో బత్తుల వెంకటలక్ష్మి బుధవారం వారి కుటుంబాన్ని పరామర్శించారు. అదే గ్రామానికి చెందిన ముత్యం దేవి ప్రసాద్ తల్లి మృతి చెందడంతో వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం మధురుపూడి గ్రామంలో కుప్పాల శ్రీను కుటుంబాన్ని పరామర్శించారు. నర్ల వెంకటేష్ అమ్మ ఇటీవల మృతి చెందడంతో ఆ కుటుంబ సభ్యులను ఓదార్చారు. పశ్చిమగోనగూడెంలో వేముల పవన్ తల్లి సత్యవతి ఇటీవల మృతి చెందడంతో వారికుటుంబ సభ్యులను వెంకటలక్ష్మి పరామర్శించారు.

ఇంటర్ విద్యార్థులకు నగదు ప్రోత్సాహం

రంగంపేట, ఫిబ్రవరి 7 : రంగంపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ చదువుతూ ప్రతిభ చూపుతున్న పదిమంది విద్యార్థినీలకు రాజమహేంద్రవరం మలబార్‌గోల్డు సంస్థ వారు మంగళవారం రాజమహేంద్రవరంలో జరిగిన కార్యక్రమంలో ఒక్కొక్క విద్యార్థినికి పదివేలు రూపాయలు చొప్పున ప్రోత్సాహక బహుమతులు జిల్లా జాయింట్ కలెక్టర్ తేజ్‌భరత్ అందించారు. ఈ కార్యక్రమంలో మలబార్ సంస్థ మార్కెటింగ్ డిప్యూటీ మేనేజర్ ప్రవీణ్‌కుమార్, షోరూం మేనేజర్ వెంకటపతి పాల్గొన్నారు. నగదు బహుమతి పొందిన విద్యార్థినులను కళాశాల ప్రిన్సిపాల్ వి.శ్రీనివాసరావు, అధ్యాపకులు హేమ, మాధురి, కృష్ణమూర్తి అభినందించారు.

ఆనం కళాకేంద్రం అద్దె రూ.10 వేలు

రాజమహేంద్రవరం సిటీ, ఫిబ్రవరి 7: సాంస్కృతిక వారసత్వ సంపదకు ప్రతీకగా నిలిచిన వెంకటేశ్వరా ఆనం కళాకేంద్రంలో కళా కారులు కేవలం రూ.10వేల అద్దెకే తమ ప్రదర్శనలు , కళా సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించేందుకు కమిషనర్ దినేష్ కుమార్ అంగీకరించారని రాజమండ్రి వారసత్వ సంపద పరిరక్షణ కమిటీ కన్వీనర్ వీఎస్ఎస్.కృష్ణకుమార్, ఆర్గనైజర్ టీకే విశ్వేశ్వరరెడ్డి తెలిపారు. రాజమండ్రి ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం విలేకరుల సమావేశంలో వెల్లడించారు. 11 అంశాలపై కమిషనర్‌తో చర్చించినట్టు కమిటీ సభ్యుడు కె.పార్థసారథి తెలిపారు. ఈ సమావేశంలో కమిటీ సభ్యులు కెకె.సంజీవరావు, పవన్, చంద్ర వీరభద్రరావు, ఎల్వి ప్రసాద్, దేశిరెడ్డి బలరామనాయుడు, ఎస్‌వీవీ.రెడ్డి పాల్గొన్నారు.

10 నుంచి సూర్యారాధన

రాజమహేంద్రవరం సిటీ, ఫిబ్రవరి 7: రాజమహేంద్రవరం సీతంపేటలో ఈనెల 10 నుంచి 25వ తేదీ వరకు నిర్వహించతలపెట్టిన షోడశదిన ప్రయుక్త పంచాయతన పూర్వక సూర్యారాధనకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని నిర్వాహకులు వడలి కుమార్ శర్మ తెలిపారు. ఈ నెల 25 వరకు ప్రతి రోజు సూర్య నమస్కారాలు, హోమాలు,శతచండీపారాయణ,హోమము, రుద్రాభిషేకం, హోమం ఉంటాయన్నారు. ప్రతిరోజు ఉదయం 7 గంటలకు కార్యక్రమాలు ప్రారంభమవుతాయని 9 గంటలకు ఉచిత కుంకుమార్చన , 11 గంటలకు సూర్యతీర్థ ప్రసాద వితరణ చేస్తామన్నారు.

ఉచిత మెగా వైద్య శిబిరం

రాజమహేంద్రవరం సిటీ, ఫిబ్రవరి 7: ప్రజలంతా ఆరోగ్యంగా జీవించాలన్న ధ్యేయంతోనే ఉచిత మెగా వైద్య శిబిరాలను నిర్వహిస్తున్నామని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఆదిరెడ్డి శ్రీనివాస్, జనసేన సిటీ ఇన్‌చార్జి అనుశ్రీ సత్యనారాయణ అన్నారు. స్థానిక 45వ డివిజన్ ఇందిరానగర్‌లో భవాని చారిటబుల్ ట్రస్ట్, వాసవీ శ్రీ మల్టీస్పెషాలిటీ ఆసుపత్రి సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత మెగా మెడికల్ క్యాంప్ నిర్వహించారు.ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కాశి నవీన్ కుమార్, పార్లమెంట్ కమిటీ ఆర్గనైజింగ్ సెక్రటరీ కొయ్యల రమణ, మాజీ కార్పొరేటర్ తాడి మరియ, ఉప్పులూరి జానకి రావయ్య, కొల్లి బుజ్జి, తురకల నిర్మల తదితరులు పాల్గొన్నారు.

విద్యలో స్వీయ సామర్థ్యాలను పెంచుకోవాలి

● యూత్ ఓరియంటేషన్ కార్యక్రమంలో వక్తలు

రాజమహేంద్రవరం అర్బన్, ఫిబ్రవరి 7 : విద్యార్థులు విద్యలో స్వీయసామర్థ్యాలను పెంచుకోవాలని ముంబయికి చెందిన మోటివేషనల్ స్పీకర్ గణేష్ కృష్ణ అన్నారు. రాజమహేంద్రవరం ఎస్‌కేవీటీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రెడ్‌క్రాస్, ఐక్యూఏసీ సంయుక్త నిర్వహణలో బుధవారం బ్రహ్మకుమారీస్ యూత్ ఓరియంటేషన్ ప్రోగ్రాం నిర్వహించారు. ప్రతి విద్యార్థి పట్టుదల, స్వావలంబన, ఆత్మ విశ్వాసం, కష్టపడే తత్వంలాంటి అలవాట్ల ద్వారా సృజనాత్మకతను పెంపొందించుకోవచ్చని తెలిపారు. యోగ సాధన, శ్వాసక్రియ, మెడిటేషన్ వంటివి విద్యార్థుల్లో ఒత్తిడిని తొలగిస్తాయన్నారు. సభకు తెలుగువిభాగాధిపతి వీవీబీ సంజీవరావు, అధ్యాపకులు గాలి వెంకటరమణ, నీలిమ, మధులత, ఎమ్మెస్ ఫణికుమార్, కోటేశ్వరరావు, సుధా, రాజ్‌కుమార్, దీప్తి, శారద పాల్గొన్నారు.

ధ్యానంతో ఒత్తిడి దూరం

రాజమహేంద్రవరం కల్చరల్, ఫిబ్రవరి 7 : ఒత్తిడి లేని ఆనందకరమైన జీవితం కోసం ధ్యానం,యోగా చేయాలని ముంబై నుంచి వచ్చిన ఇంటర్నేషనల్ యోగా ట్రైనర్ బ్రహ్మకుమార్‌కారపు గణేష్ అన్నారు. జీఎస్ఎల్ ఆసుపత్రి వైద్యసిబ్బందితోపాటు వైద్య విద్యార్థులకు రాజమండ్రి ఏవీఏరోడ్డులోని బ్రహ్మకుమారీస్ రాజయోగ శిక్షణ కేంద్రం నిర్వాహకురాలు బికె.సత్యవాణి ఆధ్వర్యంలో శిక్షణ ఇచ్చారు.ఈ కార్యక్రమం లో జీఎస్ఎల్ ఆసుపత్రి అధినేత గన్ని భాస్కరరావు ప్రిన్సిపాల్, 400 మంది వైద్య విద్యార్థులు పాల్గొన్నారు.

రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

సీతానగరం, ఫిబ్రవరి 7: మండలంలోని మిర్తిపాడు సబ్ స్టేషన్ పరిధిలోని పలు గ్రామాల్లో శుక్రవారం ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏపీఈపీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ దాట్ల శ్రీధర్ వర్మ తెలిపారు. ఉండేశ్వరపురం, మిర్తిపాడు, బొబ్బిల్లంక, ములకల్లంక గ్రామాలతోపాటు వ్యవసాయ విద్యుత్‌కు అంతరాయం కలుగుతుందని ఏఈ చంద్రమోహన్ తెలిపారు.



- సర్కారు బడాయి బడ్జెట్
- జిల్లాకు కేటాయింపుల్లేవ్
- అంతా అంకెల గారడీ
- పోలవరం మరిచారు..
- ప్రాజెక్టులను విస్మరించారు..
- పర్యాటకం పాతపాటే
- అభివృద్ధి గాలికొదిలేశారు
- కలెక్టరేట్ భవనాల ఊసేలేదు
- గోదావరిపై ప్రేమే లేదు..
- విస్తుపోయిన నాయకులు
- రాష్ట్ర బడ్జెట్‌పై విస్మయం

బడాయి ఫుల్.. విధిలింపులు నిల్..

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికలు దగ్గరపడ్డ నేపథ్యంలో నాలుగున్నరేళ్ల పాలన గురించిగొప్పగా డబ్బా కొట్టుకోవడం మినహా బుధవారం జగన్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌తో జనాలకు ఒరిగిందేం లేదు. ఏ పద్దు చూసినా స్వోత్కర్షే గానీ పైసల కేటాయింపులు లేవు. నవరత్నాలు, సాధారణ సంక్షేమ పథకాలకు చేసిన కేటాయింపుల బడాయే తప్పించి కొత్తగా ప్రవేశపెట్టిందేం లేదు. ఒకరకంగా చెప్పాలంటే జిల్లాకు ఈ బడ్జెట్‌తో ఒరిగింది శూన్యం. రాష్ట్ర బడ్జెట్‌లో గొప్పలు తప్ప గోరంత కూడా లాభం లేదు.. గతంలో ఏదో చేసేశామనే చెప్పారే తప్ప.. ఏం చేస్తామన్న దానిపై నోరు మెదపకపోవడం గమనార్హం. ఇది అసలు బడ్జెట్‌లా లేదని వైసీపీ రాజకీయ ప్రసంగంమాత్రమేననే విమర్శలు అన్ని రంగాల నుంచి వ్యక్తమవుతున్నాయి. ఎందుకంటే ఏ జిల్లాకు ఏం చేస్తాం.. కేటాయింపులేంటి.. ప్రాజెక్టుల మాటేంటి అనే అంశాలపై కనీస ప్రస్తావన లేకపోవడం గమనార్హం. పోలవరం ప్రాజెక్టుకు నిధుల ప్రస్తావన లేదు. గత ప్రభుత్వంలో హెడ్‌వర్క్సు పనులు కేవలం 42 శాతం జరిగితే 70 శాతానికి తాము పనులు చేశామని చెప్పడం గమనార్హం. స్పిల్‌వేలో రేడియల్ గేట్లు ఏర్పాటు వైసీపీ గొప్పతనంగా చెబుతూ గోదావరి నదిపై చరిత్రలో మొదటగా రేడియల్ గేట్లు ఏర్పాటు చేసినట్టు ప్రకటించారు. వాస్తవానికి ఇది పాత డిజైనే. గత ప్రభుత్వం ఈ గేట్లనే ఏర్పాటు చేసింది. మిగతా వాటి గురించి వైసీపీ ప్రస్తావన తేలేదు. పట్టిసీమ, పురుషోత్తపట్నం,చింతలపూడి ఎత్తిపోతల పథకాల ఊసేలేదు. వ్యవసాయానికి అంత చేశాం..ఇంత చేశాం అన్న గొప్పలేగానీ ఈ పనులకు ఏ విదిలింపులు లేవు. దీంతో కొత్త ప్రభుత్వం వచ్చాకే వీటికి మోక్షం అన్న సంకేతాలను జగన్ సర్కారు ఇచ్చినట్లయింది. ఇక పర్యాటక ప్రాంతంగా రాష్ట్రంలో చాలా సాధించామని చెప్పారు. జిల్లాలో ఇచ్చిన హామీల గురించి ప్రస్తావించలేదు. పర్యాటక రంగం అభివృద్ధిలో భాగంగా ఒబరాయ్ సంస్థతో ఒప్పందం చేసుకున్నట్టు ప్రకటించారు. ఈ ఒప్పందం రెండేళ్ల క్రితమే జరిగింది. పిచ్చుకలంకలో రిసార్ట్స్ కట్టడానికి అప్పట్లో నిర్ణయించారు. ఇంతవరకూ ఆ ఊసేలేదు. ఎన్నికలు కొద్ది రోజుల్లోనే జరగనున్నా వీటి ప్రస్తావన లేదు.. ఇక రోడ్లకు.. నీటి ప్రాజెక్టులకు కేటాయింపులు లేవు. ధవళేశ్వరం బ్యారేజిని పట్టించుకోలేదు. తెలుగువర్సిటీ గురించి మాట్లాడలేదు. బొమ్మూరులోని తెలుగు పీఠం ఊసెత్తలేదు. కొత్తగా జిల్లా ఏర్పాటు చేసినట్టు ప్రస్తావిం చారు. కానీ కలెక్టరేట్‌కు అవసరమైన కొత్త భవనాల నిర్మాణ ప్రస్తావన లేదు.మెడికల్ కాలేజీలు పూర్తయినట్టు , బోధనాసుపత్రులు పూర్తిస్థాయిలో పనిచేస్తున్నట్టు ప్రకటించారు. కానీ ఇక్కడ పరిస్థితి వేరేగా ఉంది. ఇటీవల పెద్దఎత్తున ఉద్యమం చేసిన అంగన్‌వాడీల జీతాలు పెంచినట్టు కూడా అందులో ప్రస్తావించారు.కానీ వాస్తవానికి జీతాలు పెంచలేదు.వేలాది మంది పేదలు ఇళ్ల కోసం ఎదురు చూస్తున్నారు. ఇప్పటికే లక్షలాది మందికి ఇచ్చినట్టు చెప్పారే కానీ అవి ఏస్థితిలో ఉన్నాయో.ఎప్పటికి పూర్తవుతాయో కూడా ప్రస్తావన లేదు.ఈ ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌ను పరిశీలిస్తే ఇప్పటికే ప్రజలు చాలా చేసేశాం, ఇంకేమీ చేయనక్కరలేదన్నట్టు ఉంది.కొత్త జిల్లాకు కేటాయింపుల్లేవ్.. బడాయి బడ్జెట్‌పై అన్ని వర్గాల నుంచి అసంతృప్తి వ్యక్తమవుతోంది. తెలుగుదేశం,జనసేన, వామపక్షాలు, బీజేపీ వంటి ప్రతిపక్షపార్టీలన్నీ బడ్జెట్ చూసి ముక్కున వేలేసు కునే పరిస్థితి ఏర్పడింది.

అంకెల గారడీ బడ్జెట్..



ఏపీ బడ్జెట్ అంకెల గారడీ మాత్రమే. దళిత సంక్షేమాన్ని పూర్తిగా గాలికొదిలేశారు. ఎస్సీ సబ్‌ప్లాన్ నిధులు కేటాయింపులు, వినియోగంపై ఎక్కడ స్పష్టత లేదు. విద్యా వ్యవస్థకు కేటాయింపులపై గందరగోళమే. ఎన్నికల బడ్జట్ కొండంత రాగం తీసి ఏదో పాట పాడినట్లుగా ఉందన్నారు. - **జవహర్, టీడీపీ జిల్లా అధ్యక్షుడు**

వైసీపీకి విజన్ లేదు



వైసీపీకి విజనే లేదు.. ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెట్ కూడా సరిగ్గా పెట్టలేకపోయారు. ఇక పూర్తి స్థాయి బడ్జెట్ ఎలా పెట్టగలరు. మీకంటూ విజన్ ఉంటే.. బడ్జెట్‌లో కనిపించేది. ఓడిపోతారని తెలిసే ఇలా పేలవంగా బడ్జెట్ పెట్టారు. మేం అధికారంలోకి రాగానే అద్భుతమైన బడ్జెట్ ప్రవేశపెడతాం. - **దుర్గేష్, జనసేన జిల్లా అధ్యక్షుడు**

అంతా దగా పాలనే..



రాష్ట్ర బడ్జెట్ పేరుగొప్ప, ఊరు దిబ్బ అన్న చందంగా ఉంది. యువతను మోసం చేసే విధంగా రాష్ట్ర బడ్జెట్ ఉంది. ఉద్యోగులకు జీతాలు కూడా చెల్లించలేని స్థితిలో అప్పులతో రాష్ట్రం ఉంటే సంపన్న రాష్ట్రం అంటూ ఆర్థికమంత్రి చెప్పుకోవడాన్ని నిరసిస్తున్నాం సుపరిపాలన ఎక్కడ ఉంది, అంతా దగా పాలనే. - **మధు, సీపీఐ జిల్లా కార్యదర్శి**

ఇది పారదర్శకత లేని బడ్జెట్



ఇది పారదర్శకత లేని బడ్జెట్. అంకెల గారడీతో ప్రవేశపెట్టిన బడ్జెట్. అభివృద్ధి, సంక్షేమాన్ని బడ్జెట్‌లో విస్మరించారు. ఇది ఓటాన్ ఎకౌంట్ బడ్జెట్ మాత్రమే. రాబోయే టీడీపీ, జనసేన ఉమ్మడి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత పూర్తిస్థాయి ప్రజారంజక బడ్జెట్‌ను ప్రవేశపెడతాం.

- బూరుగుపల్లి శేషారావు, మాజీ ఎమ్మెల్యే, నిడదవోలు

రోడ్లన్నీ బ్రహ్మాండమట?



రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ ప్రజలను ఉద్యోగులను మోసగించడమే ధ్యేయంగా ఉంది. ఎన్నికల హామీలన్నీ ఈ బడ్జెట్‌లో ప్రవేశపెట్టడం మోసపూరితమే. బడ్జెట్ ప్రసంగంలో రాష్ట్రంలో రోడ్లన్నీ బ్రహ్మాండంగా అభివృద్ధి చెందాయనడం హాస్యాస్పదంగా ఉంది.

- నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, మాజీ ఎమ్మెల్యే, అనపర్తి

మోసపూరిత బడ్జెట్



రాష్ట్ర బడ్జెట్ గందరగోళంగా ఉంది. చెప్పేదొకటి చేసేదొకటి అనే విధంగా ప్రభుత్వం బడ్జెట్‌తో మభ్య పెట్టింది. అంకెలలో చెబితేనే అర్థం కాని సామాన్యులకు శాతాల్లో చెప్పి ముఖ్యమంత్రి ప్రజలను బురిడికొట్టే ప్రయత్నం చేశారు. మోసపూరిత బడ్జెట్ ఇది..

- ఎం. వెంకటరాజు, గోపాలపురం ఇన్‌చార్జి

ప్రజలను మభ్యపెట్టే బడ్జెట్



గందరగోళ బడ్జెట్‌తో వైసీపీ ప్రభుత్వం ప్రజలను మరోసారి మభ్య పెట్టింది. పూర్తిస్థాయిలో ఏ రంగానికి కేటాయింపులు లేవు. ఎందుకు బడ్జెట్ ప్రవేశపెట్టారో కూడా అర్థం కాలేదు. పనికిరాని బడ్జెట్ ఇది. ఎన్నికలను పురస్కరించుకుని అంగెల గారడీ చూపారు.

- జొన్నలగడ్డ సుబ్బరాయచౌదరి, కొవ్వూరు

గొప్పలు తప్ప.. ఏమీ లేదు..



వైసీపీ ప్రభుత్వం ఎన్నికల ముందు ప్రవేశపెట్టిన ఓట్‌ఆన్ అకౌంట్ బడ్జెట్ చూస్తే బాధ కలుగుతుంది. గొప్పలు చెప్పుకోవడం తప్ప అందులో ఏమీ లేదు. ఈ బడ్జెట్టే వైసీపీ ప్రజా వ్యతిరేక విధానాలకు నిదర్శనం. ఎందుకు ప్రవేశపెట్టారో కూడా అర్థం కాలేదు.

- అనుశ్రీ సత్యనారాయణ, రాజమహేంద్రవరం

ప్రయోజనం ఏమీ లేదు..



రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో కేటాయింపులు సక్రమంగా లేవు. పరిశ్రమలు, కేటాయింపులకు రాయితీలు, ప్రాజెక్టులు,వ్యవసాయ రంగాలకు పెద్దగా ఒరిగిందేమిలేదు. ఈ బడ్జెట్ ఆశాజనకంగా లేదు. స్వయం ఉపాధి రంగాలను నిర్వీర్యం చేశారు.

- కే అనంత్ , రాజమహేంద్రవరం



నిడదవోలులో ఆశ కార్యకర్త హేమలత హౌస్ అరెస్ట్



కొవ్వూరులో సుందరబాబుకు నోటీస్ అందజేత

వైసీపీలో..ఆశా..నిరాశేనా!

ఆశాల చలో విజయవాడ అడ్డగింత - ముందస్తు నోటీసులు..హౌస్ అరెస్టులు

కొవ్వూరు/నిడదవోలు/రాజమహేంద్రవరం అర్బన్, ఫిబ్రవరి 7 : ప్రభుత్వం ఆశా వర్కర్లను వదల్లేదు.. తమ డిమాండ్ల సాధనకు ఛలో విజయవాడకు బయలు దేరితే.. పోలీసుల సాయంతో ఆదిలోనే అడ్డుకున్నారు. అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల సందర్భంగా ఆశా వర్కర్ల కనీస వేతనాలు అందించాలని కోరుతూ ఈ నెల 8వ తేదీన చలో విజయవాడకు యూనియన్ సంఘాలు పిలుపు నిచ్చాయి. ఈ మేరకు ఒక రోజు ముందుగానే ఆశ కార్యకర్తలకు నోటీసులు అందించి పోలీసులు నిర్బంధించారు. నిడదవోలు పట్టణంలోని ఇందిరానగర్‌లో ఉంటున్న ఆశా వర్కర్స్ యూనియన్ నాయకురాలు హేమలతను బుధవారం హౌస్ అరెస్ట్ చేశారు. ఆమెను హౌస్ అరెస్ట్ చేయడానికి ఒక హెడ్ కానిస్టేబుల్, ఇద్దరు సచివాలయ మహిళా సంరక్షణ కార్యదర్శులు, ఒక మహిళా హోమ్ గార్డులను వినియోగించారు. దాదాపు జిల్లా వ్యాప్తంగా ఆశ కార్యకర్తలకు నోటీసులు అందజేసి నిర్బంధం విధించారు. కదిలితే ఖబడ్దార్ అంటూ హెచ్చ రికలు జారీ చేశారు. దీనిపై పలు సంఘాల నాయకులు ఆందోళన వ్యక్తం చేశారు. ఆశావర్కర్లకు మద్దతిస్తున్న సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఎం.సుందరబాబుకు పోలీసులు నోటీసులు జారీచేసి హౌస్ అరెస్టు చేశారు. ఆశా కార్యకర్తలకు రాష్ట్ర ప్రభుత్వం కనీస వేతనాలు అందించక పోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వశాఖల్లో పనిచేస్తున్నవారికి రాజ్యాంగబద్ధంగా చెల్లించవలసిన వేతనాలు, సౌకర్యాలు కల్పించడంలో వైసీపీ ప్రభుత్వం, జగన్మోహనరెడ్డి పూర్తిగా వైఫల్యం చెందారన్నారు. ఆశాలు విజయవాడ వెళ్లకుండా రాష్ట్ర ప్రభుత్వం పోలీసులతో ముందస్తు అరెస్టులు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని సీఐటీయూ జిల్లా కమిటీ పేర్కొంది. బుధవారం పోలీసులు యూనియన్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు దుర్గ, హవేలాను ముందస్తు అరెస్టు చేయడంతో వారిని సిఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బి. రాజులోవ, సీపీఎం నగర కార్యదర్శి పవన్ పరామర్శించారు. జగన్ ప్రభుత్వం ఐదేళ్ల కాలంలో ఆశ వర్కర్ల సమస్యలు పరిష్కరించడంలో విఫలమైందని అన్నారు. ప్రజాస్వామ్యబద్ధంగా జరిగే నిరసనలు అణచివేయాలని చూడడం సరైనవిధానం కాదన్నారు. అరెస్టు చేసిన వారిని వెంటనే విడుదల చేయాలని, ఆశ వర్కర్ల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

మృతుల ఓట్లపై దృష్టి పెట్టండి

ఎన్నికలపై జరిగిన సమావేశంలో కలెక్టర్ మాధవీలత

రాజమహేంద్రవరం, ఫిబ్రవరి7(ఆంధ్రజ్యోతి) : జిల్లాలో తుది ఓటర్ల జాబితాలో అనేక చోట్ల మరణించిన వారు పేర్లు కూడా ఉన్నాయని 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనాలపై జిల్లాకలెక్టర్ డా.కె.మాధవీలత స్పందించారు. కలెక్టరేట్‌లో బుధవారం రాజకీయ పార్టీల ప్రతినిధులు, ఎన్నికల అధికారులతో జరిగిన సమావేశంలో పలు అంశాలను ప్రస్తావించారు. 'మరణించిన ఓటర్లు, జిల్లాలో ఇప్పటి వరకూ తొలగించిన 0.1శాతం ఓటర్లకు సంబంధించి నియోజకవర్గస్థాయిలో ఈఆర్‌ఓలు నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. 2003 ఏప్రిల్ నుంచి ఈ నెల 6వ తేదీ వరకూ జిల్లాలో మరణించిన 37,888 మంది ఓటర్ల పేర్లను జాబితా నుంచి తొలగించామన్నారు. 6,7,8 ఫారమ్‌ల ద్వారా 56,231 అభ్యంతరాలురాగా 28 వేలు పరిష్కరించగా మిగిలినవి పరిశీలనలో ఉన్నాయన్నారు. నియోజకవర్గాల వారీగా తొలగించిన ఓటర్ల జాబితాపై రిటర్నింగ్ అధికారులు సమగ్ర సమాచారం ఇవ్వాలన్నారు.గత నెల 22న ప్రకటించిన ఓటర్ల తుది జాబితాలో దొర్లిన తప్పులను గుర్తించి సరిచేయాలన్నారుఉ. రాజకీయపార్టీలు కూడా ఓటింగ్ శాతం పెరిగేలా చూడాలని సూచించారు. సమావేశంలో కాంగ్రెస్ పార్టీ ఆఫీస్ ఇన్‌చార్జి, ఎన్.రమేష్, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.రామచంద్రరావు, ఆప్ జిల్లా కార్యదర్శి ఎన్.సుబ్రహ్మణ్యం, సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు ఎస్ఎస్.మూర్తి, వైసీపీ పోల్ నిర్వహణ ఇన్‌చార్జి, రాజశేఖర్,టీడీపీ జోన్-కార్యదర్శి శ్రీనివాసరావు పాల్గొన్నారు.



డిస్ట్రిబ్యూషన్ కేంద్రంలో కలెక్టర్, కమిషనర్ పరిశీలన

డిస్ట్రిబ్యూషన్ కేంద్రం పరిశీలన

రాజమహేంద్రవరం సిటీ, ఫిబ్రవరి 7: రాజమహేంద్రవరం అర్బన్ నియోజకవర్గానికి సంబంధించిన ఎలక్షన్ మెటీరియల్ డిస్ట్రిబ్యూషన్ కేంద్రాన్ని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ మాధవీలత, రాజమండ్రి ఎన్నికల అధికారి ,కమిషనర్ దినేష్ కుమార్ పరిశీలించారు. రాజమహేంద్రవరం ఎస్‌కేవీటీ డిగ్రీ కళాశాలలో ఉన్న డిస్ట్రిబ్యూషన్ కేంద్రం వద్దకు వచ్చి తాత్కాలికంగా ఏర్పాటు చేసే స్ట్రాంగ్ రూమ్ గురించి చర్చించారు. ఆర్‌వోల వెంట డీటీ పవన్‌కుమార్, కళాశాల అధికారులు, ఇతర అధికారులు ఉన్నారు.

మెడికల్ కాలేజీ పనులు!



ఎంత కాలమిలా : రాజమహేంద్రవరంలో సాగుతున్న మెడికల్ కాలేజీ భవన నిర్మాణ పనులు

నత్తనడకన నిర్మాణ పనులు

- సా..గుతున్న భవన నిర్మాణ పనులు
- టెంపరరీ భవనంలోనే తొలి ఏడాది కాలేజీ నిర్వహణ
- ఇంకా పూర్తికాని హాస్టళ్లు.. విద్యార్థులకు ఇబ్బందులు
- ఆరంభంకాని కొత్త బోధనాసుపత్రి పనులు
- రూ.475 కోట్లు కేటాయింపు.. రూ.90 కోట్ల పనులు
- రెండేళ్లయినా పూర్తికాని మెడికల్ కాలేజీ భవనాలు

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

రాజమహేంద్రవరం ప్రభుత్వ మెడికల్ కాలేజీ పనులు నత్తనడకన సాగుతున్నాయి. ఎక్కడా లేని విధంగా ఇక్కడ 34 ఎకరాల భూమి సునాయాసంగా బదిలీ అయింది. టీడీపీ హయాంలో కొత్తగా నిర్మించిన కోస్తా జిల్లాల జైళ్ల డీఐజీ ఆఫీసు భవనంతో పాటు, ఆయన క్వార్టర్, జిల్లా ఆసుపత్రి భవనాలన్నీ కలిసి వచ్చాయి. అయినా ఇంకా మెడికల్ కాలేజీ పనులు ఒక కొలిక్కి రాలేదు.రాజమహేంద్రవరంలో 2021లో రూ.475 కోట్లతో మెడికల్ కాలేజీని ప్రభుత్వం మంజూరు చేసింది.రాజమహేంద్రవరం జిల్లా ఆసుపత్రికి సంబంధించిన 20 ఎకరాల భూమి,ఆసుపత్రి భవనాలను స్వాధీనం చేసుకుంది. సమీపంలోని సెంట్రల్ జైలుకు చెందిన 10.5 ఎకరాలు,మరో మూడున్నర ఎకరాలు మెడికల్ కాలేజి కోసం ప్రభుత్వం బదిలీ చేసింది. దీంతో భూసేకరణకు పైసా ఖర్చులేకుండా పోయింది.గతేడాది నుంచే మొదటి బ్యాచ్ పిల్లలు చేరారు. మూడున్నర ఎకరాల స్థలంలో కాలేజీ తాత్కాలిక భవనం నిర్మించి, అక్కడ తరగతులు ప్రారంభించారు. ఇక్కడ ద్వితీయ సంవత్సరం విద్యార్థు లకు ఉపయోగపడుతుందని చెబుతున్నారు. రెండేళ్ల తర్వాత దీనిని నర్సింగ్ కాలేజీకి ఇవ్వవలసి ఉంది. ఇంకా నర్సింగ్ కాలేజీ శాంక్షన్ కాలేదు. ప్రధాన మెడికల్ కాలేజీ పనులు నత్తనడకన సాగుతున్నాయి. చాలా భవనాలు ఇంకా పునాదుల్లోనే ఉన్నాయి. ఇది పూర్తి కావడానికి కనీసం రెండేళ్లు పడుతుందని అక్కడి ఇం జనీర్లు, కాంట్రాక్టర్లు చెబుతున్నారు. బోధనాసుపత్రి పనులు ఇంకా ఆరంభమే కాలేదు. ప్రస్తుతం జిల్లా ఆసుపత్రిలోని పాత భవనాలను ఆధునీకీకరిస్తూ బెడ్స్ పెంచుతున్నారు. ఒక పక్క ఆసుపత్రి నిర్వహణ జరుగు తుండగానే పనులు జరుగుతున్నాయి.మాతాశిశు భవ నంలో కొద్ది నెలల కిందట ఓ శ్లాబ్ కూడా కూలిపోయింది. మొత్తం మీద బోధనాసుపత్రి అని పేరు మార్చి, కాలేజీకి అనుబంధంగా బదిలీ చేశారు. కానీ ఇంకా పూర్తి స్థాయి బోధనాసుపత్రిగా ఇక్కడ వైద్య సేవలు అందడంలేదు. రోగులు కూర్చోవడానికి చోటు లేక చెట్ల కింద కూర్చుంటున్నారు. పాత ఆసుపత్రిలో 250 బెడ్స్ ఉండగా ఏడాదికి 100 పడకలు చొప్పున పెంచుతు న్నట్టు అక్కడ నిర్వాహకులు చెబుతున్నారు. ప్రస్తుత పనితీరు,డబ్బులు లేక లేజీ తనమూ చూస్తుంటే ఎన్నేళ్లకు ఇది పూర్తవుతుందోననే ఆందోళన ఉంది.



పునాది దాటని పనులు

హాస్టల్ సౌకర్యమేదీ?

ప్రస్తుతం 150 మంది మెడికల్ విద్యార్థులతో ఈ కాలేజీలో మొదటి ఏడాది క్లాస్‌లు ఆరంభమయ్యాయి.విద్యార్థులు హాస్టళ్ల సౌకర్యం కోసం చాలా ఇబ్బంది పడ్డారు.కానీ జైళ్ల శాఖ డీఐజీ నుంచి స్వాధీనం చేసుకున్న క్వార్టర్‌లో బాయ్స్ హాస్టల్ పెట్టారు.ఇది కొంత మందికే సరిపోతుంది. దీని పక్కనే ప్రధాన కాలేజీ పనులు ఆరంభించారు.లేడీస్ హాస్టల్ పాత ఆసుపత్రిలో ఓ భవనంలో పెట్టారు. మరో రెండు చోట్ల కూడా బాయ్స్, లేడీస్‌కు తాత్కాలిక హాస్టళ్ల ఏర్పాటు చేశారు.ఇక్కడ సరైన సౌకర్యాలు లేక విద్యార్థులు ఇబ్బందులకు గురవుతున్నారు. కొత్త భవనాలు రెండు నిర్మాణంలో ఉన్నాయి. ఇవన్నీ నాణ్యతలేని సిమెంట్ ఇటుకలతో కట్టేస్తుండడం గమనార్హం.ఇవి పూర్తి కావడానికి చాలా సమయం పడుతుంది.ఈ ఏడాది ఆగస్టు, సెప్టెంబరులో మెడికల్ విద్యా ర్థుల కౌన్సెలింగ్ ఉంటుంది.కొత్తగా చేరేవారికి హాస్టల్ సౌకర్యం ఇబ్బందికరమే.

సూపర్ స్పెషాలిటీ సౌకర్యాలేవీ?

ముఖ్యమంత్రి జగన్ ప్రతి మెడికల్ కాలేజీలోనూ సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలు అందుతున్నాయని చెబితే ఇక్కడ వైద్య సేవల కోసం వచ్చిన వారు ఆవేదన చెందుతున్నారు. కాలేజీలో జూనియర్ ఫ్యాకల్టీ ఉంది. అనుభవజ్ఞులు లేరు.పలు విభాగాలకు వైద్యులే లేరు. ఎంఆర్‌ఐ, సిటీ స్కానింగ్ వంటి సౌకర్యాలు పాత ఆసు పత్రి నుంచి ఉన్నాయి. ఇతర అత్యాధునిక సౌకర్యాలేమీ లేవు. చాలా డిపార్ట్‌మెంట్లకు హెడ్స్ లేరు. వారుంటే ఇక్కడ అసిస్టెంట్ ప్రొఫెసర్లు లేరు. రేడియాలజిస్టులు ఎవరకూ జాయిన్ కావడం లేదు. వచ్చిన వారు వచ్చినట్టే వెళ్లిపోతున్నారు.సూపర్ స్పెషాలిటీకి చెందిన పోస్టులు మంజూరయ్యాయి.కానీ కౌన్సెలింగ్ పూర్తికాలేదు. ఇంకా అనేక ముఖ్య పోస్టులు ఖాళీగా ఉన్నాయి. రూ.475 కోట్లతో ఈ మెడికల్ కాలేజీ నిర్మాణం చేపట్టినా ఇప్పటికి సుమారు 90 కోట్ల మేర పనులు మాత్రమే జరిగినట్టు ఇంజనీరింగ్ విభాగం అధికారుల కథనం. ఈ పరిస్థితు ల్లో పూర్తి స్థాయిలో ఈ కాలేజీలో 600 బెడ్స్ ఎప్పుడు ఏర్పడతాయో, కాలేజి , కొత్త ఆసుపత్రి, హాస్టళ ఎప్ప టికి పూర్తవుతాయో మరి. పైగా ఈ కాలేజీల వల్ల స్థానిక విద్యా ర్థులకు ఎక్కువ అవకాశం అనేది సరి కాదు. కౌన్సెలింగ్ విధానం వల్ల ఇతర ప్రాంతాల వారే ఎక్కువ ఉన్నారు. ఇక్కడ నర్సుల కొరత ఎక్కువ ఉంది. ఇలా మెడికల్ కాలేజీలో పనులు లేజీయే..సిబ్బంది లేక చదువు లేజీయే మరి..



ఆవు దూడను ఊయలలో వేసిన దృశ్యం

ఆవు దూడకు ఊయలోత్సవం

పెరవలి, ఫిబ్రవరి 7: గోమాతను ఎంతో పవిత్రంగా పూజి స్తుంటాం. హిందూ దేవతగా కొలుస్తాం.. దీనికి తగ్గట్టుగా గోమాతకు పూజలు చేయడం అనాదిగా వస్తోంది. ముక్కామలలో అఖండ వెంకటేశ్వరరావు గోవులను ఎంతో అల్లారు ముద్దుగా పెంచుకుంటున్నాడు. దీంతో ఆయన వద్ద ఉన్న ఆవుకు ఒక దూడ కూడా పుట్టింది. ఈ మేరకు 21వ రోజున ఉయ్యాల వేడుకను ఘనంగా నిర్వహించారు. శాస్త్రోత్తంగా ఊయల ఏర్పాటుచేసి పూలతో అలంకరించి ఆ ఊయల్లో దూడను ఉంచి ఎంతో ఆనందం గా వేడుకలు జరిపారు. పెద్దఎత్తున బంధువులు తరలివచ్చి ఆశీర్వదించారు.

కాలినడకన భద్రాచలం వెళుతున్న శ్రీరామభక్తులు



భద్రాచలం కాలినడకన వెళుతూ గోపాలపురం చేరుకున్న శ్రీరామభక్తులు

గోపాలపురం, ఫిబ్రవరి 7: కాకినాడ నుంచి భద్రాచలం శ్రీరామ చంద్రమూర్తిని దర్శించుకునేందుకు సుమారు 350 మంది భక్తులు ఈనెల 4వ తేదీ ఆదివారం బయలుదేరారు. రోజుకు 30కిలో మీటర్ల చొప్పున పాదయాత్రగా నడుస్తూ నాల్గవరోజు బుధవారం గోపాలపురం చేరుకున్నారు. ఈ సందర్భంగా బీజేపీ మండల అధ్యక్షుడు గెల్లా శ్రీనుబాబు తదితరులు భక్తులకు పెద్దాపురంలో అల్పాహారం ఏర్పాటుచేశారు. సుమారు 280 కిలోమీటర్లు పాదయాత్ర పూర్తి చేసుకుని ఈనెల 12వ తేదీ నాటికి 9రోజులు పాదయాత్ర అనంతరం ఆలయానికి చేరుకుని శ్రీరామచంద్ర మూర్తిని దర్శించుకుంటామని తెలిపారు.

కొవ్వూరు డీఎస్పీగా రామారావు బాధ్యతల స్వీకరణ



కొవ్వూరు, ఫిబ్రవరి 7 : కొవ్వూరు డీఎస్పీగా కేసీహెచ్ రామారావు బాధ్యతలు స్వీకరించారు. గుంటూరు దిశ పోలీస్‌స్టేషన్ డీఎస్పీగా పనిచేస్తున్న రామారావును ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు బదిలీల్లో భాగంగా కొవ్వూరు వచ్చారు. ఈ సందర్భంగా బాధ్యతలు తీసుకున్నారు. సబ్ డివిజన్ పరిధిలోని సీఐలు, ఎస్‌ఐ లు సిబ్బంది మర్యాద పూర్వకంగా కలుసుకుని పుష్పగుచ్చంతో స్వాగతం పలికారు. ఇప్పటివరకు కొవ్వూరు డీఎస్పీగా పనిచేసిన వీఎస్ఎన్ వర్మ నరసరావుపేట డీఎస్పీగా బదిలీపై వెళ్లారు.

న్యాయవాదుల దీక్షలకు ఐఎఫ్‌టీయూ సంఘీభావం



నిడదవోలులో న్యాయవాదుల దీక్షలకు మద్దతు తెలుపుతున్న ఐఎఫ్‌టీయూ నాయకులు

నిడదవోలు, ఫిబ్రవరి 7: న్యాయస్థానాల ద్వారా ప్రజలు న్యాయం పొందుతున్నారని ఇలాంటి తరుణంలో పాలకుల భూ దాహానికి న్యాయస్థానాలు అడ్డుతగులుతాయనే నెపంతో రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా భూహక్కు చట్టాన్ని తీసుకువచ్చిందని ఐఎఫ్‌టీ యూ జిల్లా సహాయ కార్యదర్శి ఈమని గ్రీష్మకుమార్ అన్నారు. బుధవారం నిడదవోలు పట్టణంలోని జూనియర్ సివిల్ జడ్జి కోర్టు బయట న్యాయవాదులు చేస్తున్న రిలే నిరాహారదీక్షలు బుధవారా నికి 37వ రోజుకు చేరుకుంది. వీరికి సంఘీభావం పలికిన ఐఎఫ్‌టీ యూ జిల్లా సహాయ కార్యదర్శి ఈమని గ్రీష్మకుమార్ మాట్లాడుతూ ప్రభుత్వం తీసుకువచ్చిన భూ హక్కు చట్టంతో వ్యక్తిగత ఆస్తి హక్కు చట్టం కాల రాస్తుందన్నారు. వెల్డింగ్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు తీపర్తి వీర్రాజు మాట్లాడుతూ ప్రజా భూములు కొల్లగొ ట్టే లక్ష్యంతోనే నూతన భూ హక్కుచట్టం తీసుకువచ్చారని అన్నా రు. దీనిని తిప్పికొట్టేందుకు న్యాయవాదులు, మేధావులతో కలసి ఉద్యమించాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బైపే ప్రసాదు, లక్ష్మణరావు, పోశిబాబు, ఐఎఫ్‌టీయూ కార్యకర్తలు, న్యాయవాదులు పాల్గొన్నారు.

ఆయుష్మాన్ హెల్త్‌కేర్ సెంటర్ తనిఖీ



సంగాయిగూడెం హెల్త్‌సెంటర్‌లో ఆకస్మిక తనిఖీ చేస్తున్న జిల్లా టాస్క్‌ఫోర్స్ అధికారులు

దేవరపల్లి, ఫిబ్రవరి 7: దేవరపల్లి మండలం సంగాయిగూడెంలో గ్రామ సచివాలయం పరిధిలో ఉన్న ఆయుష్మాన్ హెల్త్‌కేర్ సెంటర్‌ను జిల్లా ట్రాస్క్ ఫోర్స్ టీమ్ బుధవారం ఆకస్మిక తనిఖీ చేశారు. డీపీహెచ్ఎం టీమ్ పర్యవేక్షకు రాలు వసంతలక్ష్మి, డీపీవో కే.సంధ్యారెడ్డిలు హెల్త్‌సెంటర్‌లోని గర్భిణుల రికార్డులను, చిన్నపిల్ల ల టీకాల నమోదు రికార్డులను పరిశీలించారు. గర్భిణులు, చంటి పిల్లల తల్లులతో సమావేశం నిర్వహించి వారి నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. రికార్డులు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో యాదవోలు పీహెచ్‌సీ వైద్యాధికారి సీహెచ్ హరిచందన, టాస్క్‌పోర్సు బృందం టీమ్ అధికారులు సీహెచ్ భాస్కర్, రామకృష్ణ, సీహెచ్‌వో డీ.సంజీవ, హెల్త్‌సూపర్ వైజర్ పద్మకుమారి, తదితరులు పాల్గొన్నారు.

కామేశ్వరరావు కుటుంబానికి సాయం అందజేత



సంగీత కామేశ్వరరావు కుటుంబానికి ఆర్థికసాయం అందజేస్తున్న జనసేన అధినేత పవన్‌కళ్యాణ్

కొవ్వూరు, ఫిబ్రవరి 7 : కొవ్వూరు మండలం సీతంపేట గ్రామానికి చెందిన సంగీత కామేశ్వరరావు కుటుంబానికి జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ రూ.5లక్షలు ఆర్థిక సాయం అందజేశారు. సీతంపేట గ్రామానికి చెందిన సంగీత కామేశ్వరరావు ప్రమాదవశాత్తూ మరణించాడు. మంగళగిరి జనసేన పార్టీ కార్యాలయంలో బుధవారం కొవ్వూరు నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే టి.వి.రామారావు ఆధ్వర్యంలో కామేశ్వరరావు కుటుంబానికి రూ.5 లక్షల రూపాయల జనసేన ప్రమాదబీమా చెక్కును పవన్‌కళ్యాణ్ అందజేశారు. ఈ కార్యక్రమంలో కొవ్వూరు పట్టణ అధ్యక్షుడు డేగల రామ్‌కుమార్ పాల్గొన్నారు.

నిడదవోలులో రోడ్డు భద్రత వారోత్సవాలు

నిడదవోలు, ఫిబ్రవరి 7: ప్రతిఒక్కరూ రవాణాశాఖ నిబంధనలను పాటించాలని మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ ఎస్.శ్రీనివాస్ నాయక్ అన్నారు. బుధవారం నిడదవోలు పట్టణంలోని సత్యనారాయణ లారీ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ భవనంలో 34వ రోడ్డు భద్రతా వారోత్సవాల అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో డ్రైవింగ్ భద్రతా ప్రమాణాలపై నిబంధనలపై అవగాహన కల్పించారు. ఈకార్యక్రమంలో అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ ఎండీజమీర్, అసోసియేషన్ కార్యదర్శి మద్దుకూరి శ్రీనివాస్, సహాయ కార్యదర్శి వడ్డి శ్రీనివాస్, ట్యాక్సీ అండ్ ఆటో యూనియన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఓటరు జాబితాలో తప్పిదాలకు తావుండరాదు



బీఎల్‌వోల శిక్షణా కార్యక్రమంలో మాట్లాడుతున్న కలెక్టర్ మాధవీలత

బీఎల్‌వోల శిక్షణలో జిల్లా కలెక్టర్ మాధవీలత

రాజమహేంద్రవరంరూరల్, ఫిబ్రవరి7: ఓటరు జాబితాలో ఓటరు పేరు, ఫోటో గుర్తింపు ఉండే విధంగా బీఎల్‌వోలు వ్యక్తిగత బాధ్యతతో పరిశీలించి నిర్ధారణ చేసుకోవాలని ఓటరుజాబితాలో ఎటువంటి తప్పిదాలకు తావులేకుండా ఉండాలని జిల్లా కలెక్టర్ మాధవీలత పేర్కొన్నారు. రాజమహేంద్రవరం రూరల్ మండలం రాజవోలులో రాజమహేంద్రవరంరూరల్ నియోజకవర్గం బీఎల్‌వోలు, ఇతర ఎన్నికల అధికారులతో ఓటరు జాబితా అనుబంధ అంశాలపై రిటర్నింగ్ అధికారి తేజ్‌భరత్‌తో కలిసి శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాధవీలత మాట్లాడుతూ ఓటరు జాబితా రూపకల్పనలో బాధ్యత బీఎల్‌వోలదే అన్నారు. క్షేత్రస్థాయిలో బీఎల్‌వోలు వారి పరిధిలో గల పోలింగ్ కేంద్రాలలో అన్ని మౌలిక సదుపాయాలు ఉండేలా చూసుకోవాల్సి ఉందన్నారు. రూరల్ నిమోజకవర్గం రిటర్నింగ్ అధికారి తేజ్‌భరత్ మాట్లాడుతూ ఎన్నికల ప్రక్రియలో అర్హతగల ఓటరు తమ ఓటుహక్కును వినియోగించడంలో ఓటరు జాబితా పారదర్శకంగా ఉండాలన్నారు. ఓటరు జాబితా విషయంలో మన నియోజకవర్గం రోల్‌మోడల్‌గా ఉండాలన్నారు. కేంద్రాలకు కావలసిన ఫర్నీచర్, లైటింగ్ తాగునీరు వంటి వసతులు సమకూర్చేవిధంగా చర్యలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో కొవ్వూరు సబ్‌కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ, సహాయ కలెక్టర్ యస్వంత్‌కుమార్, ఆర్డీవో ఎ.చైత్రవర్షిణి, ఈఆర్‌వో సరళా వందన్న కడియం, రూరల్ తహసీల్దార్లు, బి.రమాదేవి, వైకెవీ అప్పారావు, బీఎల్‌వోలు తదితరులు పాల్గొన్నారు.

సాధారణ ఎన్నికలు సక్రమంగా జరిగేలా చర్యలు చేపట్టాలి

స్టేట్ ఛీఫ్ ఎలక్ట్రోరల్ అధికారి ముఖేష్‌కుమార్ మీనాకు రామకృష్ణారెడ్డి ఫిర్యాదు

అనపర్తి, ఫిబ్రవరి 7: అనపర్తి నియోజకవర్గంలో త్వరలో జరుగనున్న సాధారణ ఎన్నికలు సజావుగా జరిగే విధంగా చర్యలు చేపట్టాలని ఇటీవల బిక్కవోలు మండలంలో జరిగిన ఎన్నికల నియమావళి ఉల్లంఘనపై చర్యలు చేపట్టాలని బుధవారం వెలగపూడిలోని స్టేట్‌చీఫ్ ఎలక్ట్రోరల్ అధికారి ముఖేష్‌కుమార్ మీనాకు టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నల్లమిల్లి రామకృష్ణారెడ్డి ఫిర్యాదు చేశారు. అనపర్తి నియోజకవర్గంలో కొందరు అధికారులు వైసీపీ నాయకులకుతొత్తులుగా వ్యవహరిస్తున్నారని ఎన్నికల నియమావళిని ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని ఆయన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఇటీవల బిక్కవోలు మండల తహసీల్దార్‌గా విధులు నిర్వహించి ఎన్నికల బదిలీలలో భాగంగా బదిలీపై వెళ్లిన పోసిబాబు ఐదు రోజుల తరువాత బిక్కవోలు వచ్చి ఇండ్ల పట్టాలపై పాత తేదీలలో సంతకాలు చేసి నిబంధనలు ఉల్లంఘించారని ఇదే విషయాన్ని స్థానిక వీఆర్‌వో అశోక్ మీడియా ముందు ఒప్పుకున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. అదేవిధంగా బిక్కవోలు మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో ఎంపీపీ భర్త, జెడ్‌పీటీసీ భర్త పాల్గొని రాజకీయ ప్రసంగాలు చేశారని ఇంత జరుగుతున్నా ఎంపీడీవో నిలువరించే ప్రయత్నం చేయలేదని దీనిపై కూడా విచారణ చేసి చర్యలు చేపట్టాలని ఆయన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన వెంట శాసనమండలి మాజీ చైర్మన్ షరీఫ్ ఉన్నారు.



వెలగపూడిలో రాష్ట్ర ముఖ్య ఎలక్ట్రోరల్ అధికారికి ఫిర్యాదు చేస్తున్న రామకృష్ణారెడ్డి

పోలింగ్ కేంద్రాల తనిఖీ

దేవరపల్లి, ఫిబ్రవరి 7: దేవరపల్లి మండలంలోని అన్ని పోలింగ్ కేంద్రాలను పరిశీలించినట్లు తహసీల్దార్ వైవీఎస్ ఆచారి బుధవారం తెలిపారు. పోలింగ్ సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఓటర్లకు తాగునీటి సదుపాయాల అం శాలపై వీఆర్వోలు, బీఎల్‌వోలు చర్చించారు. మండలంలో 67 పోలింగ్ కేంద్రా లను పరిశీలించినట్లు తెలిపారు. ఆర్ఐ వెంకటేష్ పాల్గొన్నారు.



ధూమంతునిగూడెంలో పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న తహశీల్దార్ వైవీఎస్ ఆచారి

ప్రజలకు అసౌకర్యం కలిగించవద్దు

సబ్ కలెక్టర్ ఆశుతోష్ శ్రీవాత్సవ్, ట్రైనీ కలెక్టర్ యశ్వంత్‌కుమార్‌రెడ్డి

గోపాలపురం, ఫిబ్రవరి 7: జీలుగుమిల్లి, కొవ్వూరు జాతీయ రహదారి బీబీ 265 రహదారి విస్తర్ణ పనుల్లో భాగంగా దొండపూడి సెంటర్‌లో 23 మీటర్ల రోడ్డు నిర్మించటం ద్వారా చిరువ్యాపారులతో పాటు నివాసయోగ్యమైన ఇళ్ల గ్రామస్థులు కోల్పోతారంటూ ఇటీవలే ఆర్డీవోకు దొండపూడి గ్రామస్థులు వినతి పత్రం ఇచ్చిన విషయం తెలిసిందే. గ్రామస్థుల అభ్యర్థన మేరకు స్పందించిన ఉన్నతాధికారులు బుధవారం దొండపూడి సెంటర్‌లో రహదారి విస్తరణ మ్యాప్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాత్సవ్, ట్రైనీ కలెక్టర్ యశ్వంత్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ రహదారుల నిబంధనల్లో భాగంగా సర్వేచేసిన 23మీటర్ల రహదారి విస్తర్ణతో గ్రామస్థులకు కలిగే నష్టాన్ని అంచనా వేయడంతోపాటు గ్రామస్థుల అభ్యర్థన మేరకు 18మీటర్లు రోడ్డుని నిర్మించటం ద్వారా గ్రామస్థులకు కలిగే ప్రయోజనాన్ని విడివిడిగా రెండు నివేదికలు తయారు చేయాలని అందుకు రెండు బృందాలు ఏర్పాటు చేయడంతోపాటు అన్నివిధాలా సహాయ సహకారాలు అందించాలని ఎంపీడీవో వనజాక్షిని ఆదేశించారు. జాతీయ రోడ్డు విస్తర్ణ సర్వేయర్‌తోపాటు మండల సర్వేయర్, వీఆర్వో, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు ఈ బృందంలో ఉండేలా చూడాలన్నారు. రెండురోజుల్లో ఈరెండు నివేదికలు సిద్ధంచేసి తమకు సమర్పించాలని అన్నారు. ప్రస్తుతం ఉన్న రహదారి మధ్యలో మధ్యాలో నుంచి రెండు వైపులా రోడ్డు నిర్మాణం చేసేలా మరో నివేదిక ఇవ్వాలన్నారు. ఆ నివేదికను కేంద్రప్రభుత్వానికి పంపిస్తామన్నారు. ఆయన వెంట సర్పంచ్ మల్లిపూడి అంచిబాబు, వైఎస్సార్ మండల అధ్యక్షుడు పోతిరెడ్డి నాగరాజు, డిప్యూటీ తహసీల్దార్ కృష్ణ, గ్రామస్థులు ఉన్నారు.



దొండపూడి సెంటర్‌లో జాతీయ రహదారి బీబీ 265 మ్యాప్‌ను పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్ ఆశుతోష్ శ్రీవాత్సవ్ , ట్రైనీ కలెక్టర్ యశ్వంత్‌కుమార్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షురాలు అరిగెల అరుణకుమారి

9న చాగల్లులో షర్మిలారెడ్డి పర్యటన

కొవ్వూరు, ఫిబ్రవరి 7: పీసీసీ అధ్యక్షురాలు వై.ఎస్.షర్మిలారెడ్డి ఈనెల 9వ తేదీన చాగల్లులో పర్యటిస్తున్నట్లు జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలు అరిగెల అరుణకుమారి తెలిపారు. కొవ్వూరు ప్రెస్‌క్లబ్‌లో బుధవారం నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో అరుణకుమారి మాట్లాడుతూ ఈనెల 7వ తేదీ నుంచి షర్మిలారెడ్డి రాష్ట్ర పర్యనకు వస్తున్నారన్నారు. 8న ఏలూరుజిల్లా దెందులూరులో రోడ్ షో, అనంతరం బహిరంగ సభలో పాల్గొంటారన్నారు. 9న కొవ్వూరు నియోజకవర్గంలోని చాగల్లులో రచ్చబండ కార్యక్రమంలో పాల్గొంటారన్నారు. అనంతరం కాకినాడజిల్లా తునిలో జరిగే బహిరంగసభకు తరలివెళతారన్నారు. చాగల్లు రచ్చబండ కార్యక్రమం లో ప్రజల నుంచి సమస్యలు తెలుసుకుని వాటి పరిష్కారానికి పోరాటం చేస్తారన్నారు. షర్మిలారెడ్డి రచ్చబండ కార్యక్రమానికి కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అధికసంఖ్యలో పాల్గొనాలన్నారు. పీసీసీ అధ్యక్షురాలిగా బాధ్యతలు స్వీకరించినప్పటి నుంచి రాష్ట్రంలో పర్యటిస్తూ ప్రజా సమస్యలను తెలుసుకుంటున్నారన్నారు. ఏపీకి ప్రత్యేక హోదా తీసుకురావడంలో జగన్మోహనరెడ్డి, చంద్రబాబులు ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు గంధం పూజ్య నరసింహ బాపూజీ, పి. ప్రభాకర్‌చౌదరి, కారింకి వెంకటేశ్వరరావు, గెడ్డం సాయిబాబా, చిన్నం మురళీకృష్ణ, కొణిదల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

నానో యూరియాపై అవగాహన



రైతులకు నానో యూరియాపై అవగాహన కల్పిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి మాధవరావు

కొవ్వూరు, ఫిబ్రవరి 7 : నానో యూరియా నేల, నీరు, వాయు కాలుష్యాన్ని తగ్గిస్తుందని జిల్లా వ్యవసాయ శాఖాధికారి కె.మాదవరావు అన్నారు. బుధవారం కొవ్వూరు పట్టణ శివారు నందమూరు రోడ్‌లో నానో యూరియా పనితీరుపై రైతు వంక వెంకట్రావు పొలంలో అవగాహన కల్పించారు. వెంకట్రావు ప్రదర్శన క్షేత్రంలో నానో యూరియా స్ప్రే చేయించారు. 500 ఎంఎల్ నానో యూరి యా బాటిల్ 45 కేజీల సాధారణ యూరియా బస్తాను సమర్థ వంతంగా భర్తీ చేస్తుందన్నారు. సాంప్రదాయ యూరియాలో ఉండే నత్రజని కేవలం 25 నుంచి 30శాతం మాత్రమే మొక్కకు అందుబాటులో ఉండి, మిగిలిన నత్రజని వివిధ రూపాలలో వ్యర్థం అవుతుందన్నారు. నానో యూరియా 80శాతంపైగా ఎక్కువ నత్రజనిని మొక్కకు అందజేస్తుందన్నారు. సాధారణ యూరియా బస్తా రూ.266లు ఉండగా నానో యూరియా 500 ఎంఎల్ బాటిల్ రూ. 225లకు అందుబాటులో ఉందన్నారు. నానో యూరియా లీటరు నీటికి 4 ఎంఎల్ చొప్పన కలిపి పిచికారీ చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కొవ్వూరు డివిజన్ ఏడీఏ పి.చంద్రశేఖర్, మండల వ్యవసాయాధికారి ఎ.గంగాధర్, ఎంఈవో, ఎ.నవీన్, సురేష్ రైతులు పాల్గొన్నారు.





కొవ్వూరు 4వ వార్డు అంబేడ్కర్ విగ్రహంవద్ద రమాబాయి జయంతి వేడుకలలో పాల్గొన్న మాల మహాసభ నాయకులు, తాళ్లపూడిలో రమాబాయి అంబేడ్కర్‌కి నివాళులర్పిస్తున్న విద్యార్థులు

రమాబాయి అంబేడ్కర్ జయంతి

తాళ్లపూడి, ఫిబ్రవరి 7: మండలంలోని రాగోలపల్లి మండల పరిషత్ పాఠశాలలో బుధవారం డాక్టర్ బాబా సాహెబ్ అంబేడ్కర్ సతీమణి రమాబాయి జయంతిని ఘనంగా నిర్వహిం చారు. రమాభాయి చిత్ర పటానికి పూల మాలలు వేసి విద్యార్థులు ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కొవ్వూరు: మాత రమాబాయ్ అంబేడ్కర్ 123వ జయంతిని కొవ్వూరు 4వ వార్డులో మాలమహాసభ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంటు బొంతా శ్యాం రవిప్రకాష్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. మాత రమాబాయ్ చేసిన త్యాగం మరువలేనిదన్నారు. కార్యక్రమంలో ముకురపు రామకృష్ణ, అల్లాడి శ్రీను, రొట్టె హరిబాబు, దంతంశెట్టి సతీష్, దర్శి చెన్నయ్య పాల్గొన్నారు.

నులి పురుగుల మాత్రల పంపిణీ విజయవంతం చేయండి



నులిపురుగుల మాత్రల పంపిణీ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎంపీడీవో రమేష్

గోపాలపురం, ఫిబ్రవరి 7: నులిపురుగుల మాత్రల పంపిణీ కార్యక్రమం విజయవంతం చేయాలని ఎంపీడీవో కే.రమేష్ ఆరోగ్య సిబ్బందికి సూచించారు. ఈ నెల 9వ తేదీన నులిపురుగుల మాత్రలు ఒక సంవత్సరం నుంచి 19సంవత్సరాల వయస్సు కలిగిన ప్రతీఒక్కరికీ నులిపురుగుల మాత్రలు వేయించాలన్నారు. అంగన్వాడీ కేంద్రాలు, ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలు, ప్రయివేటు స్కూల్స్‌లో అన్నిచోట్ల విద్యార్థినీ విద్యార్థులకు మాత్రలు వేయాలన్నారు. కార్యక్రమంలో హుకుంపేట వైద్యాధికారిణి బీవీవీ దుర్గాభవాని, అన్నదేవరపేట వైద్యాధికారిణి సువర్ణలత, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్టీసీ డ్రైవర్‌కు ఏడాది జైలు

కొవ్వూరు, ఫిబ్రవరి 7 : రోడ్డు ప్రమాదంలో వృద్ధురాలి మృతికి కారణమైన ఆర్టీసీ డ్రైవరుకు ఒక సంవత్సరం సాధారణ జైలు శిక్ష విధించినట్లు కొవ్వూరు పట్టణ సీఐ వి.జగదీశ్వరరావు తెలిపారు. పోలీసులు అందించిన వివరాల ప్రకారం కొవ్వూరు మండలం దొమ్మేరు గ్రామంలో 2020 మార్చి 3వ తేదీన బస్టాండ్ వద్ద రోడ్డు దాటుతున్న వృద్ధురాలు వి.అప్పాయమ్మను ఆర్టీసీ బస్సు ఢీకొంది. వృద్ధురాలు మృతి చెందడంతో అప్పటి పట్టణ ఎస్ఐ కె.వెంకటరమణ ప్రమాదానికి కారణమైన డ్రైవర్ వెలుగుల వీరవెంకట తులసీ ప్రసాద్‌పై కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపర్చారు. 2వ అదనపు జ్యూడీషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టులో వాదనలు పూర్తయి నేరం రుజువు కావడంతో డ్రైవర్ తులసీ ప్రసాద్‌కు ఒక సంవత్సరం సాధారణ జైలు శిక్ష విధిస్తూ మేజిస్ట్రేట్ జి.సాయి కృష్ణ తీర్పుచెప్పారు. కేసు విచారణలో ప్రాసిక్యూషన్ తరపున ఏపిపి డి. బాబూరావు, కోర్టు కానిస్టేబుల్ వి.హరిబాబు సహకరించారని సీఐ తెలిపారు.

మద్యం సీసాలతో వ్యక్తి అరెస్టు



మద్యంసీసాలతో వ్యక్తిని అరెస్టు చేసిన సెబ్ అధికారులు

దేవరపల్లి, ఫిబ్రవరి 7: దేవరపల్లి ఎస్ఈబీ స్టేషన్ పరిధిలో జరిగిన దాడుల్లో గోపాలపురం మండలం వేలచింతలగూడెం గ్రామానికి చెందిన పాల వెంకటకృష్ణ అనే వ్యక్తిని అరెస్టుచేసి 22లీట ర్ల నాటుసారాను స్వాధీనం చేసుకున్నామన్నారు. గోపాలపురం మండల జగన్నాదపురం గ్రామానికి చెందిన నేతల నల్లా అనే వ్యక్తిని అరెస్టుచేసి మూడు మద్యంసీసాలు 12 బీరుసీసాలు స్వాధీనం చేసుకున్నామని వీరిపై కేసు నమోదు చేసినట్లు సీఐ కేవీ స్వామి తెలిపారు. ఈ దాడుల్లో ఎస్ఐ సుధీర్, సిబ్బంది పాల్గొన్నారు.

యడ్లబండిని ఢీకొని ఆటోడ్రైవర్ మృతి

కొవ్వూరు, ఫిబ్రవరి 7 : కుక్కను తప్పించబోయి యడ్లబండిని ఢీకొని ప్రమాదానికి గురై ఆటో డ్రైవర్ మృతి చెందినట్టు కొవ్వూరు పట్టణ సీఐ వి.జగదీశ్వరరావు తెలిపారు. చాగల్లు మండలం మల్లవరం గ్రామానికి చెందిన మల్లిన సత్యనారాయణ (45) ప్రతిరోజు మల్లవరం నుంచి రాజమహేంద్రవరం సర్వీస్ ఆటో నడుపుకుంటూ జీవిస్తున్నాడు. ప్రతిరోజు మాదిరిగా ఈనెల 6వ తేదీన సత్యనారాయణ రాజమహేంద్రవరం వెళ్లి తిరిగి ఇంటికి వస్తున్నాడు. అర్ధరాత్రి 2 గంటల సమయంలో కొవ్వూరు మండలం వేములూరు సాయిబాబా గుడి సమీపానికి వచ్చేసరికి అడ్డుగా వచ్చిన కుక్కను తప్పించబోయి ఆటోతో ఎదురుగా వస్తున్న యడ్లబండిని ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో ఆటోడ్రైవర్ సత్యనారాయణకు యడ్లబండి కాడ తలకు తగలడంతో తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు 108 అంబులెన్స్‌లో కొవ్వూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా వైద్యులు పరీక్షించి మృతి చెందినట్టు ధ్రువీకరించారు. మృతుడి భార్య పద్మ ఫిర్యాదుపై కేసు నమోదు చేసినట్టు సీఐ జగదీశ్వరరావు తెలిపారు. మృతుడు సత్యనారాయణకు ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

దుర్గా రమేష్‌కు మద్దిపాటి పరామర్శ

గోపాలపురం, ఫిబ్రవరి 7 : రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న గంగులగుర్తి దుర్గారమేష్‌ను గోపాలపురం నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి మద్దిపాటి వెంకట్రాజు బుధవారం పరామర్శించారు. దుర్గారమేష్‌కు వైద్యం నిమిత్తం టీడీపీ నాయకులు, వెంకట్రాజు కలిపి రూ.లక్ష ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు రొంగలి సత్యనారాయణ, గద్దె హరిబాబు, కొర్లపాటి రాము, మోహన్ తదితరులు ఉన్నారు.



రోడ్డు ప్రమాదంలో గాయపడిన దుర్గారమేష్‌ను పరామర్శించిన మద్దిపాటి వెంకట్రాజు

కొవ్వూరు స్వామీజీ ఆధ్వర్యంలో శోభాయాత్ర



కొవ్వూరు, ఫిబ్రవరి 7 : త్రిదండి స్వామీజీ శ్రీశ్రీ మద్భక్తి సుధీర దామోదర మహరాజు ద్వితీయ వార్షిక విరహ మహోత్సవాలనుపురస్కరించుకుని కొవ్వూరు గౌడీయమఠం స్వామీజీ శ్రీమద్భక్తి విబుధ వామన మహరాజు ఆధ్వర్యంలో శోభాయాత్ర నిర్వహించారు. బుధవారం కొవ్వూరు లాంచీలరేవువద్ద ఉన్న శ్రీ రామానంద గౌడీయామఠంలో రాధాకృష్ణులకు ప్రత్యేకపూజలు చేశారు.అనంతరం పట్టణ పురవీధులలో శ్రీమద్భక్తి విబుధ వామన మహరాజు ఆధ్వర్యంలో 108 కలశాలతో నగర సంకీర్తన, శోభాయాత్ర నిర్వహించారు. శ్రీమద్భక్తి విబుధ వామన మహరాజు మాట్లాడుతూ ఈనెల 7నుంచి 13వ తేదీ వరకు గౌడీయామఠంలో భాగవత సప్తాహములు, త్రిదండి స్వామీజీ శ్రీశ్రీ మద్భక్తి సుధీర దామోదర మహరాజు తిరోభావము, శ్రీశ్రీకృష్ణవసంత పంచమి, శ్రీవిష్ణుప్రియ ఆవిర్భావము, శ్రీల పుండరీక విద్యానిధి, శ్రీల రఘునందన ఠాకూరుల ఆవిర్భావములను పురస్కరించుకుని ప్రత్యేక హోమాలు, అభిషేకాలు, పూజలు, నైవేద్యాలు, ప్రసాద వితరణలు జరుగుతా యన్నారు. ఈ సమావేశంలో శ్రీపాద భక్తిప్రమోద జనార్ధన మహరాజు, శ్రీపాద రమణ కృష్ణదాస్, భక్తులు, అధికసంఖ్యలో పాల్గొన్నారు.

సినిమా గైడ్

కొవ్వూరు

యువరాజ్‌మాల్ వై.స్క్రీన్1	కిస్మత్, బూట్‌కట్ బాలరాజు
వై.స్క్రీన్2	గేమ్ ఆన్
దేవిశ్రీ(గాయత్రి)	హనుమాన్
అనన్య	అంబాజీపేట బ్యారేజీ బ్యాండ్

నిడదవోలు

వీ మ్యాక్స్	అంబాజీపేట బ్యారేజీ బ్యాండ్
రాధాకృష్ణ	హనుమాన్
శ్రీగణపతి	సైంధవ్

దేవరపల్లి

శ్రీరామ్ సినీ మ్యాక్స్	గుంటూరు కారం
శ్రీరామ్ సినీ మ్యాక్స్	గుంటూరు కారం

నల్లజర్ల

శ్రీలక్ష్మి మల్టీప్లెక్స్	సలార్
శ్రీనివాస	సలార్